


# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

మంగళవారం,
డిసెంబర్ 3, 2024

సంపుటి : 10 | సంచిక :14 | రంగారెడ్డి | ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ | పేజీలు 10 | వెల 4/-


## కులోన్మాదానికి మహిళా కానిస్టేబుల్ బలి



కులాంతర వివాహం చేసుకుందని అక్కపై తమ్ముడి కక్ష

స్కూటీపై వెళ్తుండగా కారుతో ఢీ.. ఆపై కొడవలితో దాడి

మెడ నరికి దారుణ హత్య.. వివాహమైన 22 రోజులకే ఘోరం

రూ. కోట్ల విలువైన భూమి తగాదాలూ కారణమేనా?

2లో

## వాజేడు ఎస్సై ఆత్మహత్య



రిసార్టులో రివాల్వర్‌తో కాల్చుకుని బలవన్మరణం

2020లో పోలీసు ఉద్యోగానికి ఎంపికైన హరీశ్

ఆర్నెల్లుగా వాజేడులో విధులు

ఆత్మహత్య సమయంలో ఆయనతో ఓ యువతి

వీరి మధ్య ప్రేమ.. పెళ్లి కోసం ఒత్తిడి అంటూ కథనాలు

వ్యక్తిగత కారణాలతోనే ఎస్సై బలవన్మరణం: ఎస్పీ

2లో



## మావోయిస్టుల మృతదేహాలను భద్రపర్చండి

నేటి వరకు ఏటూరునాగారంలోనే ఉంచండి

ఫోరెన్సిక్ నిపుణులతోనే పోస్టుమార్టం చేయించారా

శవ పరీక్షలో పాల్గొన్న వారి వివరాలివ్వండి

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు

2లో

### రుణ మాఫీ, భరోసాతో

# కొందరి గుండెల్లో పిడుగులు

కొన్ని రాజకీయ పార్టీలు ఓట్ల కోసం వస్తున్నాయ్

పది సంవత్సరాల్లో ఏమీ చేయని పార్టీలు
పది నెలల కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బద్నాం చేస్తున్నాయి

కర్రు కాల్చి వాతపెట్టాలి.. విష ప్రచారం తిప్పికొట్టాలి

ఫామ్‌హౌజ్‌లో పడుకున్నోళ్లకు మనశ్శాంతి లేదు

చిన్న ఆరోపణ కూడా లేకుండా టీజీపీఎస్సీ పనితీరు

త్వరలోనే గ్రూప్-1 నియామక పత్రాలు అందజేస్తాం

ప్రపంచ పారిశ్రామిక ఆకర్షణ శక్తిగా తెలంగాణ

ఆరోగ్య ఉత్సవాలు, కోకాకోలా ఫ్యాక్టరీ ప్రారంభంలో
సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు

వైద్య, ఆరోగ్య మంత్రి దామోదర పనితీరుకు కితాబు




హైదరాబాద్, సిద్దిపేట, డిసెంబరు 2 : "సంక్రాంతి పండుగకు గంగిరెద్దులు వస్తాయి. జోలెలో బిచ్చంపడగానే పోతాయి. అలాగే, ఇప్పుడు కొన్ని రాజకీయ పార్టీలు సర్పంచ్ ఎన్నికల కోసం వస్తున్నాయి. కాంగ్రెస్ సర్కారును బద్నాం చేసే ఆ పార్టీలకు కర్రుకాల్చి వాత పెట్టాలి" అంటూ బీఆర్ఎస్, బీజేపీలను ఉద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్, పదకొండో ఏడాది అధికారంలో కొనసాగుతున్న బీజేపీ ఏం చేశాయని నిలదీశారు. పదేళ్లపాటు వాళ్లు ఏమీ చేయలేనప్పుడు పది నెలల్లోనే తాము ఎలా అభివృద్ధి చేయగలుగుతామని ప్రశ్నించారు. ఆ రెండు పార్టీలు తమ ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నాయని, సర్కారుపై జరుగుతున్న విష ప్రచారాన్ని తిప్పికొట్టాలని, ప్రజా ప్రభుత్వాన్ని కాపాడుకునే బాధ్యత తెలంగాణ ప్రజలదేనని వ్యాఖ్యానించారు. ప్రపంచ

(మిగతా 2వ పేజీలో)

## హైదరాబాద్ అభివృద్ధికి 3,446 కోట్లతో ప్రాజెక్టులు

నేడు శంకుస్థాపన చేయనున్న రేవంత్



## రైతులపైకి దూసుకెళ్లిన లారీ..

### నలుగురి దుర్మరణం

మరో నలుగురికి తీవ్ర గాయాలు.. ఇద్దరు విషమం

రంగారెడ్డి జిల్లా ఆలూరు వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

రోడ్డు పక్కన కూరగాయలు అమ్ముతున్న రైతులపైకి లారీ

అప్రమత్తతతో కొందరికి తప్పిన ముప్పు

## బహిరంగ చర్చకు రండి.. చార్జిషీట్ సంగతి తేలుస్తాం

మీ పదేళ్ల పాలన.. మా

ఏడాది పాలనపై చర్చించేందుకు వస్తారా?

బీఆర్ఎస్, బీజేపీలు కవల పిల్లలని

మరోమారు రుజువైంది: టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ ఫైర్

హైదరాబాద్: కాంగ్రెస్ ఏడాది పాలనపై చార్జిషీట్ అంటూ బీజేపీ చేస్తున్న హడావుడి చూస్తుంటే గురివింద సామెత గుర్తుకు వస్తోందని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి. మహేశ్‌కుమార్‌గౌడ్ ఎద్దేవా చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఏడాది పాలన, కేంద్రంలో బీజేపీ పదేళ్ల పాలనపై ఆ పార్టీ నేతలు తమతో బహిరంగ చర్చకు వస్తే చార్జిషీట్ సంగతి తేలుస్తామని వ్యాఖ్యానించారు. తమతో చర్చకు వచ్చే సత్తా బీజేపీ నేతలకు ఉందా అని మండిపడ్డారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత

(మిగతా 2వ పేజీలో)





## ప్రతిష్టంభనకు తెర!

### స్పీకర్ చొరవ, విపక్షాలతో చర్చలు

రాజ్యాంగంపై ఉభయసభల్లో చర్చకు ఇరుపక్షాల అంగీకారం

లోక్‌సభలో 13, 14న చర్చ రాజ్యసభలో 16, 17 తేదీల్లో

నేటినుంచి సజావుగా పార్లమెంటు

న్యూఢిల్లీ: లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా చొరవ ఫలించింది. పార్లమెంటు శీతాకాల సమావేశాలపై వారం రోజులుగా నెలకొన్న ప్రతిష్టంభనకు ఎట్టకేలకు తెరపడింది. రాజ్యాంగ దిన వజ్రోత్సవాల సందర్భంగా ఉభయ సభల్లోనూ రాజ్యాంగంపై చర్చ చేపట్టేందుకు ప్రభుత్వానికి, ప్రతిపక్షాలకు మధ్య అంగీకారం కుదిరింది. ఆ మేరకు డిసెంబర్ 13, 14 తేదీల్లో లోక్‌సభలో, 16, 17ల్లో రాజ్యసభలో

(మిగతా 2వ పేజీలో)

# ఏడాది పాలన.. ఎడతెగని వేదన

పూటకో మాట.. రేవంత్‌కు పరిపాటే

ఫిరాయింపులు, దబాయింపులు,
బుకాయింపులే అన్నీ: హరీశ్

ప్రజాపాలన అని కంచెల పాలన తెచ్చిండు

ప్రతిపక్షంలో ఒక మాట, ఇప్పుడొక మాట

మోసం చేయడమే ఈ ముఖ్యమంత్రి నైజం

ఎగవేసుడే రేవంత్‌రెడ్డి పాలనా విధానం

సర్కార్ తప్పులను ప్రశ్నించినా..
సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినా కేసులే!

లగచర్లను రణరంగంగా మార్చింది సర్కారే

అర్ధరాత్రివేళ ఆడబిడ్డలపై దాష్టీకాలు: హరీశ్



హైదరాబాద్, డిసెంబర్ 2 : ఒకే విషయంపై రాత్రి ఓ మాట.. తెల్లారి మరోమాట మాట్లాడటంలో సీఎం రేవంత్‌రెడ్డి తనకు తానే సాటి అని, ఈ సబ్జెక్ట్‌లో ఆయనకు పీహెచ్‌డీ ఇవ్వొచ్చని మాజీ మంత్రి హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. ఏడాది కాంగ్రెస్ పాలనలో ప్రజలు ఎడతెగని వంచనకు గురయ్యారని, ప్రజాపాలన అని చెప్పి గద్దెనెక్కి ప్రజల హక్కులను హరిస్తున్నారని, నిర్బంధాలు, అణచివేతలు, కంచెలు, ఆంక్షలు నిత్యకృత్యమయ్యాయని, చిన్నారులు, మహిళలు, గర్భిణులపై దాష్టీకాలు పెరిగిపోయని నిప్పులు చెరిగారు. రేవంత్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఓ మాట.. ఇప్పుడో మాట మాట్లాడుతూ డబుల్ స్టాండర్డ్ లీడర్‌గా ఘనత వహించాడని ఎద్దేవా చేశారు. సోమవారం తెలంగాణభవన్‌లో శాసన మండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, మాజీ హోంమంత్రి మహమూద్‌అలీ, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చిరుమర్తి లింగయ్య, లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ నేత చింతా ప్రభాకర్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్ మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి రెండు నాల్కల ధోరణిని ఎండగట్టారు. వీడియో ట్కస్లైడ్స్ ప్రదర్శిస్తూ

(మిగతా 2వ పేజీలో)

# రుణ మాఫీ, భరోసాతో కొందరి గుండెల్లో పిడుగులు

పారిశ్రామిక పెట్టుబడులకు ఆకర్షణ శక్తిగా తెలంగాణ వెలుగొందుతోందని, వ్యాపారాభివృద్ధికి అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించడానికి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా ఎన్టీఆర్ మార్గ్‌లోని హెచ్‌ఎండీఏ గ్రౌండ్స్‌లో సోమవారం నిర్వహించిన ఆరోగ్య ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. సిద్దిపేట జిల్లా ములుగు మండలం బండ తిమ్మాపూర్‌లో హిందుస్థాన్ కోకాకోలా బెవరేజెస్ (హెచ్‌సీసీబీ)కి చెందిన గ్రీన్ ఫీల్డ్ ఫ్యాక్టరీని ఆయన ప్రారంభించారు. ఈ రెండు కార్యక్రమాల్లో ఆయన మాట్లాడుతూ.. సమగ్ర విధానం అనుసరిస్తున్న హెచ్‌సీసీబీని అభినందిస్తున్నానని, ఉద్యోగ ఉపాధి కల్పనతోపాటు ఈ ప్రాంత అభివృద్ధికి గణనీయంగా ఉపయోగపడుతుందని వివరించారు. రుణ మాఫీ, రైతు భరోసాతో కొంతమంది గుండెల్లో పిడుగులు పడుతున్నాయని బీఆర్ఎస్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. గత పాలకులు వరి వేసుకుంటే ఉరేనని అన్నారని, తమ ప్రభుత్వం సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇస్తోందని, సన్న వడ్లకు ఇస్తున్న బోనస్‌తో కౌలు రైతులు కూడా సంతోషంగా ఉన్నారని వివరించారు. వచ్చే పదేళ్లూ తామే అధికారంలో ఉంటూ బోనస్‌ను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. సంక్రాంతి తర్వాత రైతు భరోసా కచ్చితంగా ఇచ్చి తీరతామని పునరుద్ఘాటించారు. అందుకే, "ఫామ్ హౌజ్‌లో పడుకున్నోళ్లకి మనశ్శాంతి లేదు. వాళ్ల గుండెల్లో మంటకు మందు లేదు. ఆయనకు కావాల్సిన మందును మా మంత్రి జూపల్లి కృష్ణారావు శాఖ నుంచే ఇవ్వగలం" అని ఎద్దేవా చేశారు.

### వైద్యులకు నియామక పత్రాలు అందించిన సీఎం

ఇటీవలే నియమితులైన 422 మంది సివిల్ అసిస్టెంట్ సర్జన్లలో కొందరికిబీ ఫుడ్ సేఫ్టీ అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియామక పత్రాలను అందజేశారు. అనంతరం 16 కొత్త నర్సింగ్ కాలేజీలు, 28 ఎలైడ్ హెల్త్ సైన్స్ కాలేజీలుబీ ట్రాన్స్‌జెండర్ల కోసం ఏర్పాటు చేసిన 32 మైత్రి క్లినిక్‌లను సీఎం వర్చువల్‌గా ప్రారంభించారు. కొత్తగా కొనుగోలు చేసిన 213 అంబులెన్స్‌లను జెండా ఊపి ప్రారంభించారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ఒక్కోదాంట్లోకి వెళ్లి పరిశీలించారు.

### ట్రాన్స్‌జెండర్లతో ముఖ్యమంత్రి మాటా ముచ్చట

స్టాల్స్‌ను పరిశీలిస్తున్న క్రమంలో వైద్య ఆరోగ్య, దివ్యాంగ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌జెండర్ల స్టాల్‌లోకి సీఎం, మంత్రులు వెళ్లారు. అక్కడ ప్రేమలీల అనే ట్రాన్స్‌జెండర్ సీఎంతో మాట్లాడారు. తమకు మహాలక్ష్మి పథకం కింద ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా తమ కోసం మైత్రి క్లినిక్‌లను ఏర్పాటు చేయడంపై సంతోషం వ్యక్తం చేశారు. తమను జనజీవన స్రవంతిలోకి తీసుకు వచ్చారని ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా, ట్రాఫిక్ కంట్రోల్ చేసే సిబ్బందిగా త్వరలో ట్రాన్స్‌జెండర్స్‌ను నియమిస్తామని సీఎం వారికి హామీ ఇచ్చారు.

### త్వరలోనే గ్రూప్-1 నియామక పత్రాలు

గ్రూప్ 1 ఉద్యోగాల నియామక పత్రాలను త్వరలోనే అందజేస్తామని, 563 మంది అధికారులను తెలంగాణ రాష్ట్ర నిర్మాణంలో భాగస్వాములను చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. 2011 తర్వాత గ్రూప్-1 పరీక్షలు నిర్వహించలేదని, 13 ఏళ్ల తర్వాత గ్రూప్-1 పరీక్షలు నిర్వహించి ప్రశ్న పత్రాలను జిరాక్స్ సెంటర్లలో అమ్ముకున్నారని మండిపడ్డారు. ఇప్పుడు 563 మంది గ్రూప్-1 అధికారులు తెలంగాణ నిర్మాణంలో భాగస్వాములు కాబోతున్నారని, టీజీపీఎస్సీ పనితీరుకు ఇది గీటురాయి అని వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వం టీజీపీఎస్సీని రాజకీయ పునరావాస కేంద్రంగా మార్చిందని, ఆర్ఎంపీ డాక్టర్లు, డిప్యూటీ ఎమ్మార్వోలను దానికి సభ్యులుగా నియమించిందని మండిపడ్డారు. సర్వీస్ కమిషన్‌ను బీఆర్ఎస్ పూర్తిగా రాజకీయ పునరావాస కేంద్రంగా మార్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వాళ్లలా టీజీపీఎస్సీని తాము రాజకీయ పునరావాసంగా మార్చబోమని స్పష్టం చేశారు.



"ఇప్పుడు చిన్న ఆరోపణ కూడా లేకుండా టీజీపీఎస్సీ పని చేస్తోంది. మూడున్నరేళ్ల సర్వీసు ఉన్నప్పటికీ సీనియర్ ఐఏఎస్ అధికారి బుర్రా వెంకటేశాన్ని కమిషన్ చైర్మన్‌గా, ఉన్నత చదువులు చదువుకున్న వారిని సభ్యులుగా నియమించాం" అని స్పష్టం చేశారు. ఉద్యోగాలు, ఉపాధి కోసం తెలంగాణ ఉద్యమంలో యువత రోడ్లపైకి వచ్చి పోరాడిందని సీఎం రేవంత్ గుర్తు చేశారు. కానీ, గత ప్రభుత్వం నోటిఫికేషన్లు ఇవ్వలేదని, ఇచ్చినా పరీక్షలు పెట్టకుండా ప్రశ్నపత్రాలను అమ్ముకుందని మండిపడ్డారు. కేసీఆర్ ఇంట్లో వాళ్లను ఉద్యోగాల నుంచి బర్తరఫ్ చేసిన తర్వాతే తెలంగాణ యువతకు ఉద్యోగాలు వచ్చాయని మరోమారు గుర్తు చేశారు. "డీఎస్సీ వాయిదా వేయాలని రాజకీయ ప్రేరేపిత కృత్రిమ ఆందోళన చేశారు. ఎవరు అడ్డుపడినా డీఎస్సీ పరీక్షలు నిర్వహించి 55 రోజుల్లో నియామక పత్రాలు అందించాం. తెలంగాణ యువతపై మా ప్రభుత్వానికున్న చిత్తశుద్ధికి ఇది నిదర్శనం. గ్రూప్%-%1 పరీక్షలను వాయిదా వేయాలని కోర్టులకు వెళ్లినా న్యాయస్థానాలు సమర్థించలేదు. పరీక్ష వాయిదా కోసం కొందరు కృత్రిమ ఉద్యమాలు చేశారు. పదేళ్లపాటు రాష్ట్రంలోని యూనివర్సిటీలకు వైస్ చాన్సలర్లను బీఆర్ఎస్ నియమించలేదు. మేం వచ్చిన తర్వాత నియమించాం. ఆరోగ్యశ్రీ పథకాన్ని గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. కాంగ్రెస్ వచ్చాక ఆరోగ్యశ్రీ పరిమితిని 10 లక్షలకు పెంచాం. ఏడాది కాలంలో రూ.835 కోట్ల ముఖ్యమంత్రి సహాయ నిధిని ప్రజలకు ఇవ్వడం ఒక రికార్డు" అని స్పష్టం చేశారు.

### వైద్య శాఖలో ఏడాదిలో 14వేల ఉద్యోగాలు

ఒక్క ఏడాది కాలంలోనే ఆరోగ్య శాఖలో 14 వేల ఉద్యోగాలను భర్తీ చేశామని, 7,750 మంది పారామెడికల్ సిబ్బందికి ఎల్బీస్టేడియంలో నియామక పత్రాలను అందజేశామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా దామోదర రాజనర్సింహ సమర్థంగా పని చేస్తున్నారని కితాబిచ్చారు. గత ప్రభుత్వం ఎనిమిది వైద్య కళాశాలలకు జీవోలిచ్చి చేతులు దులుపుకొందని, ఎలాంటి వసతులు, మౌలిక సదుపాయాలు కల్పించలేదని విమర్శించారు. తాము వచ్చిన తర్వాత వాటిలో అన్ని రకాల సదుపాయాలు కల్పించడమే కాకుండా కేంద్రాన్ని ఒప్పించి వాటికి అనుమతులు సా?ధించామని వివరించారు. వైద్య శాఖలో 6,500 మందిని నియమించాలని నిర్ణయించామని, కాంగ్రెస్ ప్రభుత్వ ప్రాధాన్యం విద్య, వైద్యమేనని స్పష్టం చేశారు. "తెలంగాణ తల్లి విగ్రహాన్ని సచివాలయంలో పెట్టాలన్న ఆలోచన కూడా గత పాలకులకు రాలేదు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను గత పాలకులు నెరవేర్చలేదు. పదేళ్లపాటు అధికారంలో ఉండి జయ జయహే పాటను జాతికి అంకితం చేయకపోవడం ద్రోహం కాదా?" అని రేవంత్ నిలదీశారు. డిసెంబరు 7, 8, 9 తేదీల్లో ట్యాంక్‌బండ్ పరిసరాల్లో తెలంగాణ ప్రభుత్వ ఏడాది విజయోత్సవాలకు ప్రజలు తరలిరావాలని కోరారు.

## హైదరాబాద్ అభివృద్ధికి 3,446 కోట్లతో ప్రాజెక్టులు

### నేడు శంకుస్థాపన చేయనున్న రేవంత్

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 2 : ప్రజా పాలన ఏడాది విజయోత్సవాల సందర్భంగా హైదరాబాద్‌లో పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంకురార్పణ చేయనున్నారు. హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫర్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (హెచ్-సిటీ) ప్రాజెక్టులో భాగంగా వేర్వేరు ప్రాంతాల్లో రూ.3,446 కోట్లతో వీటికి శంకుస్థాపన చేయనున్నారు. జీహెచ్ఎంసీ చేపట్టనున్న ఈ ప్రాజెక్టులకు ప్రసాద్ ఐ మ్యాక్స్ పక్కనున్న హెచ్ఎండీఏ గ్రౌండ్‌లో ముఖ్యమంత్రి భూమి పూజ చేస్తారు. వంతెనలు, అండర్‌పాస్‌లు, కారిడార్ల అభివృద్ధి, నాలాల విస్తరణ, రీ మోడలింగ్ వంటి పనులను హెచ్-సిటీలో భాగంగా చేపడుతున్నారు. గ్రేటర్‌లోని ప్రధాన కూడళ్లు, రహదారులపై రూ.150 కోట్లతో చేపడుతున్న సుందరీకరణ పనులూ ప్రారంభిస్తారు. రోడ్లపై వరద నీరు నిలవకుండా ప్రధాన రహదారుల్లోని 12 ప్రాంతాల్లో రూ.16.50 కోట్లతో నీటి సంపులను నిర్మిస్తున్నారు. సచివాలయం ఎదురుగా, లేక్ వ్యూ గెస్ట్ హౌస్ ప్రాంతాల్లో 4 నిర్మా ణాలు ఇప్పటికే పూర్తయ్యాయి. వాటిని సీఎం ప్రారంభించనున్నారు. ట్యాంక్ బండ్‌లో 9న నిర్వహించనున్న విజయోత్సవాల ముగింపు వేడుకలకు జీహెచ్ఎంసీ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది.

### రూ.2,091 కోట్లతో కోకాకోలా ఫ్యాక్టరీ

బండ తిమ్మాపూర్‌లో 49 ఎకరాల్లో రూ.2,091 కోట్లతో కోకాకోలా ఫ్యాక్టరీని ఏర్పాటు చేశామని, ప్రస్తుతం ఏడు రకాల ఉత్పత్తులను అందించనున్నామని సీఎం రేవంత్‌కు మంత్రి శ్రీధర్‌బాబు వివరించారు. పారిశ్రామికాభివృద్ధితోపాటు పర్యావరణ పరిరక్షణకు ఈ ఫ్యాక్టరీ నిదర్శనంగా నిలుస్తుందని చెప్పారు. మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, టీజీఐఐసీ చైర్‌పర్సన్ తూర్పు నిర్మలా జగ్గారెడ్డి, సంస్థ సీఈవో జువాన్ పాబ్లో రోడ్రిగ్స్‌తో కలిసి రేవంత్‌రెడ్డి కోకాకోలా ఫ్యాక్టరీని సందర్శించారు.

### రసాభాసగా కార్యక్రమం

కోకాకోలా ఫ్యాక్టరీని ప్రారంభించడానికి సీఎం రేవంత్ లోపలికి వెళుతున్న సమయంలో కాంగ్రెస్ కార్యకర్తలు పెద్దపెట్టున నినాదాలు చేస్తూ గేట్లు దూకి రావడంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. సీఎం వెంట తనతోపాటు తన అనుచరులను అనుమతించలేదని, గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న తనను కాదని మరో నేత బండారు శ్రీకాంత్‌రావు వర్గానికి ప్రాధాన్యం ఇస్తున్నారని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి ఆందోళనకు దిగారు. ఆయనకు మద్దతుగా కార్యకర్తలు టెంటు తొలగించి, ఫ్లెక్సీలు చింపేశారు. దాంతో, నర్సారెడ్డి వర్గీయులను పోలీసులు అడ్డుకున్నారు. అక్కడ పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో నర్సారెడ్డిని సీఎం రేవంత్‌రెడ్డి లోపలికి పిలిపించి మాట్లాడారు. కొద్దిసేపటికే ఆందోళన సద్దుమణిగింది.



## ఎమ్మెల్సీ కవితకు పద్మశాలి చేనేత కార్మికుల సమస్యలను వివరించిన యువజన విభాగం జిల్లా అధ్యక్షులు దోర్నాల గజేందర్ నేత

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి (గణేష్ సాగర్) : బిఆర్ఎస్ నాయకురాలు ఎమ్మెల్సీ కవితను కలిసిన పద్మశాలి యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు దోర్నాల గజేందర్ నేత.ఈ సందర్భంగా చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్సీ కవితకు వివరించి చేనేత సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం పై ఒత్తిడి తేవాలని కోరారు.ఈ కార్యక్రమంలో అఖిలభారత పద్మశాలీ రాజకీయ విభాగం అధ్యక్షుడు బొల్ల శివశంకర్, పద్మశాలి నాయకులు,తదితరులు, పాల్గొన్నారు.

## వాజేడు ఎస్సై ఆత్మహత్య



వాజేడు/రేగొండ, డిసెంబరు 2 : ములుగు జిల్లా వాజేడు ఎస్సై రుద్రారపు హరీశ్ (29) ఆత్మహత్యకు పాల్పడ్డారు. పూసూరు జాతీయ రహదారి పక్కన ఉన్న ప్రైవేటు రిసార్టులో సోమవారం ఆయన సర్వీసు రివాల్వర్‌తో కాల్చుకున్నారు. తల కింది భాగం నుంచి తూటా వెళ్లడంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందారు. పేలుడు శబ్దం విన్న రిసార్టు సిబ్బంది గదిలోకి వెళ్లి చూడగా.. హరీశ్ రక్తపుమడుగులో కనిపించారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై ఆత్మహత్యకు కారణాలపై వదంతులు వ్యాపించాయి. పని ఒత్తిడి వల్లేనని తొలుత ప్రచారం జరగ్గా.. ప్రేమ వ్యవహారంతోనే అనే చర్చలు సాగుతున్నాయి. వీటిపై పోలీసు శాఖ విచారణ చేపట్టింది. క్లూస్ టీం ఆధారాలను సేకరించింది. కాగా, వాజేడు ఠాణా పరిధిలో ఇటీవల పోలీస్ ఇన్‌ఫార్మర్ల నెపంతో ఇద్దరిని మావోయిస్టులు హత్య చేశారు. రెండు నెలల క్రితం కూడా.. మావోయిస్టులు రెండుసార్లు సమావేశం నిర్వహించారు. ఈ పరిస్థితుల్లో పని ఒత్తిడితోనే ఎస్సై హరీశ్ బలవన్మరణానికి పాల్పడారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

## ప్రతిష్టంభనకు తెర!

చర్చ జరగనుందని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెణ్ రిజిజు ప్రకటించారు. సోమవారం అన్ని పార్టీల పార్లమెంటరీ పక్ష నేతలతో స్పీకర్ భేటీ అనంతరం ఆయన మీడియాకు ఈ మేరకు తెలిపారు. మంగళవారం నుంచి ఉభయ సభల సమావేశాలూ సజావుగా జరిగేలా సహకరించేందుకు అన్ని పక్షాలూ అంగీకరించాయన్నారు. దీన్ని భేటీలో పాల్గొన్న విపక్షాల నేతలు కూడా ధ్రువీకరించారు. విపక్షాలు చర్చకు పట్టుబడుతున్న సంభాల్ హింస, మణిపూర్ కల్లోలం తదితరాల పరిస్థితి ఏమిటని ప్రశ్నించగా నిబంధనలకు లోబడి ఏ అంశాన్నైనా సభల్లో లేవనెత్తవచ్చని రిజిజు బదులిచ్చారు. అదానీ, మణిపూర్ కల్లోలం తదితర అంశాలపై చర్చకు విపక్షాలు పట్టుబడుతుండటంతో నవంబర్ 25న పార్లమెంటు శీతాకాల సమావేశాలు మొదలైనప్పటి నుంచీ ఉభయ సభల్లో రోజూ వాయిదాల పర్వం సాగుతుండటం తెలిసిందే. దీనికి తెర దించేలా విపక్షాలను ఒప్పించేందుకు ఓం బిర్లా కొద్ది రోజులుగా ప్రయత్నిస్తున్నారు. వాటికి కొనసాగింపుగా ఆయన సోమవారం అఖిలపక్ష భేటీ నిర్వహించారు. కాంగ్రెస్ నుంచి గౌరవ్ గొగొయ్, డీఎంకే నుంచి టీఆర్ బాలు, తృణమూల్ కాంగ్రెస్ నుంచి కల్యాణ్ బెనర్జీ తదితరులు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుదిరిన సమన్వయ ఒప్పందం ప్రకారం సమాజ్‌వాదీ పార్టీ సంభాల్ అంశాన్ని, తృణమూల్ బంగ్లాదేశ్ సమస్యను లేవనెత్తేందుకు అనుమతించనున్నట్టు సమాచారం. తాము డిమాండ్ చేస్తున్న మేరకు రాజ్యాంగంపై రెండు రోజుల ప్రత్యేక చర్చకు మోదీ సర్కారు ఎట్టకేలకు అంగీకరించిందని కాంగ్రెస్ పేర్కొంది. అదానీ, సంభాల్ తదితర అంశాలపై పార్లమెంటులో చర్చకు భయపడి తప్పించుకుంటోందని దుయ్యబట్టింది. ఆ పార్టీ గట్టిగా పట్టుబడుతున్న అదానీ అంశంపై చర్చకు అధికార పక్షం అంగీకరిస్తుందా లేదా అన్నదానిపై స్పష్టత లేదు. ఈ విషయంలో ఇతర విపక్షాలేవీ కాంగ్రెస్‌కు దన్నుగా నిలవడం లేదు. ప్రతి సమావేశాల్లోనూ పార్లమెంటును అధికార బీజేపీ హత్య చేస్తూ వస్తోందని టీఎంసీ ఎంపీ డెరిక్ ఓబ్రియాన్ దుయ్యబట్టారు.

### అవే ఆందోళనలు.. ఉభయసభలూ నేటికి వాయిదా

అదానీ, సంభాల్, అజ్మీర్ దర్గా సహా పలు అంశాలపై సోమవరం పార్లమెంటు అట్టుడికింది. వాటిపై చర్చకు విపక్షాలు పట్టుబట్టడంతో సోమవారం కూడా ఉభయ సభలూ కార్యకలాపాలేవీ జరపకుండానే వాయిదా పడ్డాయి. లోక్‌సభ ప్రారంభమవగానే స్పీకర్ ఓం బిర్లా ప్రశ్నోత్తరాలు చేపట్టగా విపక్షాలు అడ్డుకున్నాయి. అదానీపై చర్చించాలంటూ నినాదాలు చేస్తూ ఆందోళనకు దిగడంతో సభ తొలుత మధ్యాహ్నం దాకా వాయిదా పడింది. తర్వాత కూడా విపక్షాల ఆందోళనలు కొనసాగడంతో మంగళవారానికి వాయిదా పడింది. రాజ్యసభలోనూ ఇదే తంతు కొనసాగింది. అదానీ సహా పలు అంశాలపై విపక్షాలిచ్చిన 20 వాయిదా తీర్మానాలను చైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్ తిరస్కరించారు. ఆందోళనల నడుమ సభ తొలుత మధ్యాహ్నానికి, తర్వాత మంగళవారానికి వాయిదా పడింది.

## మావోయిస్టుల మృతదేహాలను భద్రపర్చండి

హైదరాబాద్, డిసెంబరు 2 : ములుగు జిల్లా ఏటూరు నాగారం ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన ఏడుగురు మావోయిస్టుల మృతదేహాలను మంగళవారం వరకు ఏటూరునాగారం ఆస్పత్రిలోనే భద్రపర్చాలని పోలీసులకు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. తన భర్త మల్లయ్య మృతదేహాన్ని చూసేందుకు పిటిషనర్ కాల్వల ఐలమ్మకు అనుమతి ఇవ్వాలని చెప్పింది. అలాగే పోస్టుమార్టంలో పాల్గొన్న డాక్టర్లు, ఫోరెన్సిక్ నిపుణుల వివరాలను అందజేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేసింది. పోలీసులు తన భర్త మల్లయ్య మృతదేహాన్ని చూడనివ్వడం లేదని కాల్వల ఐలమ్మ అనే మహిళ సోమవారం హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ వేశారు. దీనిపై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున న్యాయవాది డి.సురేశ్ కుమార్ వాదనలు వినిపించారు. పిటిషనర్ తన భర్త మృతదేహాన్ని చూసేందుకు అనుమతించాలని ములుగు ఎస్పీకి ఈ%-%మెయిల్ ద్వారా విజ్ఞప్తి చేశారని.. అలాగే పోస్ట్‌మార్టం చేసేటప్పుడు బంధువులెవరినైనా అనుమతించాలని కోరినట్లు తెలిపారు. పిటిషన్‌ను అనుమతించకపోవడం చట్టాన్ని ఉల్లంఘించడమేనని పేర్కొన్నారు. ఏడుగురు మావోయిస్టుల మృతదేహాలకు పోలీసులు హడావుడిగా, ఫోరెన్సిక్ నిపుణులు లేకుండానే పోస్టుమార్టం చేయించారని ఆరోపించారు. పోలీసులు.. మావోయిస్టుల ఆహారంలో విషం, మత్తు పదార్థాలు కలిపారని.. వారు అపస్మారక స్థితిలోకి వెళ్లాక చిత్రహింసలకు గురిచేసి కాల్చేశారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో జాతీయ మానవ హక్కుల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం పోస్టుమార్టం జరిపించాలని కోరారు. అదేవిధంగా పిటిషనర్ తన భర్త మృతదేహాన్ని చూసేందుకు అనుమతించాలని కోరారు. అది నిజమైన ఎన్‌కౌంటర్ అయితే మృతదేహాలను వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి ఎందుకు తరలించలేదని.. ఫోరెన్సిక్ నిపుణుల ఆధ్వర్యంలో ఎందుకు పోస్టుమార్టం చేయించలేదని ప్రశ్నించారు. మరోవైపు పోలీసులు, ప్రభుత్వం తరఫున హోంశాఖ న్యాయవాది మహేశ్‌రాజే వాదనలు వినిపించారు. ఆదివారం మృతదేహాలకు ఏటూరునాగారంలో పోస్టుమార్టం నిర్వహించామని.. డాక్టర్ల బృందంలో ఫోరెన్సిక్ నిపుణులున్నారని పేర్కొన్నారు. పిటిషనర్‌ను సైతం మృతదేహాలను చూసేందుకు అనుమతించామని చెప్పారు. శాంతి భద్రతల సమస్య తలెత్తే అవకాశం ఉన్నందున మృతదేహాలను వరంగల్ తరలించలేదని పేర్కొన్నారు.



## బహిరంగ చర్చకు రండి.. చార్జిషీట్ సంగతి తేలుస్తాం

ఏడాది కాలంలో తెలంగాణలో అమలవుతోన్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై తాము చర్చకు రెడీగా ఉన్నామని చెప్పారు. ఏటా 2 కోట్ల ఉద్యోగాలిస్తామని, నల్లధనం తెచ్చి ప్రతి అకౌంట్‌లో రూ.15 లక్షలు వేస్తామని, వంద రోజుల్లో అన్ని ధరలు తగ్గిస్తామని, డాలర్‌కు పోటీగా రూపాయి విలువ పెంచుతామని, నిత్యావసరాల ధరలు తగ్గిస్తామని, రూ.50కే లీటర్ పెట్రోల్ ఇస్తామని చెప్పిన బీజేపీ మాటలు ఏమయ్యాయని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో అప్రజాస్వామికంగా వ్యవహరించి ప్రభుత్వాలను కూల్చా రని, దేశ వ్యాప్తంగా వివిధ పార్టీలకు చెందిన 411 మంది ఎమ్మెల్యేలను చేర్చుకున్న బీజేపీ నేతలు తమకు సుద్దులు చెబుతారా అని ప్రశ్నించారు. 45 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా దేశంలో నిరుద్యోగ తీవ్రత ఉందని గుర్తు చేశారు. 2014, 2019, 2024 ఎన్నికల్లో బీజేపీ ఇచ్చిన మేనిఫెస్టోను తీసుకొని ఆ పార్టీ నేతలు వస్తే, తమ 2023 ఎన్నికల మేనిఫెస్టోను తీసుకొని తాము వస్తామని, ఏడాదిలో ఏం చేశామో తాము చెబుతామని, పదేళ్లలో ఏం చేశారో బీజేపీ నేతలు చెప్పాలని సవాల్ విసిరారు. రాష్ట్రంలో బీఆర్ఎస్, బీజేపీలు ఒక్కటేనని మరోమారు రుజు వైందని, సమయం వచ్చినప్పుడల్లా ఆ పార్టీలు ఏ టీం, బీ టీంలా వ్యవహరి స్తాయని ఎద్దేవా చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌తో మ్యాచ్‌ఫిక్సింగ్ చేసుకున్నందుకే తెలంగాణలో బీజేపీ అడుగంటిపోతోందని, ఇప్పుడు చార్జిషీట్ అంటూ కొత్త డ్రామాకు తెరలేపారని ఎద్దేవా చేశారు. ఆ రెండు పార్టీలు కవల పిల్లల్లాంటివని ఈ చార్జిషీట్‌తో రుజువైందన్నారు. ఏడాదిగా తాము చేస్తున్న కార్యక్రమాలేవీ బీజేపీ నేతలకు కనపడడం లేదా అని మహేశ్‌గౌడ్ ప్రశ్నించారు.

### ఏడాది పాలన.. ఎడతెగని వేదన

రేవంత్ తీరును బట్టబయలు చేశారు. అధికారంలోకి రాగానే మూడు పంటలకు పెట్టుబడి సాయం ఇస్తానని చెప్పిన రేవంత్‌రెడ్డి, ఇప్పుడు రెండు పంటలకు కూడా ఇవ్వకుండా ఎగ్గొట్టి రైతులను నిండా ముంచారని హరీశ్ మండిపడ్డారు. 11 విడుతల్లో రూ.72 వేల కోట్లను కేసీఆర్ ప్రభుత్వం రైతుబంధు కోసం విడుదల చేసిందని, రైతుబీమా కోసం రూ.10 వేల కోట్లు ఇచ్చిందని, మొత్తంగా రూ.82 వేల కోట్లు రైతులు, రైతు కుటుంబాల కోసం కేటాయించిందని, ఇది రేవంత్ సర్కార్ చేసిన రుణమాఫీ కంటే 4 రెట్లు ఎక్కువ అని హరీశ్‌రావు గుర్తుచేశారు. వానకాలం, యాసంగికి రైతుభరోసా ఇవ్వకుండా మోసం చేసి, ఇప్పుడు సంక్రాంతి తర్వాత ఇస్తామని చెప్పడంలో ఆంతర్యమేమిటని నిలదీశారు.

# ఎస్సీ వర్గీకరణను అడ్డుకోవాలని చూస్తున్నా మాలల కుట్రలను తిప్పికొడతాము

### ఎమ్మార్పీఎస్ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి బోయ లింగస్వామి




వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి డిసెంబర్ 02 : ఎస్సీ వర్గీకరణను అడ్డుకోవాలని చూస్తున్నా మాల కుట్రలను తిప్పికొడతామని ఎమ్మార్పీఎస్ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి బోయ లింగస్వామి మాదిగ అన్నారు. చౌటుప్పల్ మండల కేంద్రంలోని మార్కెట్ యార్డ్ లో దళిత సంఘాల నాయకులు తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించడం జరిగింది. అనంతరం మాట్లాడుతూ మాలలు ఎన్ని కుట్రలు చేసిన వివేక్ వెంకట్ స్వామి లాంటి వాళ్లు ఎన్ని కోట్లు ఖర్చుపెట్టి ఎన్ని మీటింగ్ పెట్టిన ఎస్సీ వర్గీకరణను అడ్డుకోలేరని ఆయన అన్నారు. 30 సంవత్సరాల సుదీర్ఘకాలం మాదిగ మాదిగ ఉపకులాలకు జరుగుతున్న అన్యాయం పై ఎన్నో బడిదుడకులకు ఎదుర్కొంటూ ధర్మమధ్యమైన పోరాటం కోసం అలుపు పెరగని నిర్వహిస్తున్న మందకృష్ణ మాదిగపై మాల నాయకులు విమర్శలను తీవ్రంగా ఖండిస్తున్నాము. మాదిగ మాదిగ ఉప కులాల లాంటి కడుపు కాలిన పోరాటం అయితే వివేక్ ది మంత్రి పదవి కోసమే ఆరట పడుతున్నారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు బోయ రామచంద్రర్, బోయ దేవేందర్, ఉదరి వెంకటేష్, ఆల్వాస్ పేట కిష్టయ్య, బక్క శ్రీనాథ్, గుడ్డేటి యాదయ్య, బండమీది మల్లేష్, భద్రి లింగయ్య, ఉదరి శ్యాంసుందర్. ఆరుట్ల లింగస్వామి. సామాజిక ఉద్యమకారుడు కట్టెల లింగస్వామి. తూర్పుంటి రవి. సుక్క అర్జున్. ఉదరి నరసింహ, బొమ్మ మల్లేష్. బోదుల నరేష్. ఎర్ర పెంటయ్య. గ్యారే సుధాకర్. ఎర్ర శంకర్. బోయ గణేష్, శ్రీనివాస్, బద్రి బాలరాజ్, తదితరులు పాల్గొన్నారు..

# మానసిక ఆరోగ్యం పట్ల పోలీసులు మరింత శ్రద్ధ కనబరచాలి




విశాఖపట్నం వార్త మిర్రర్ : నగర పోలీసు కమీషనర్ డా. శంఖబ్రత బాగ్చి, ఐ.పి.ఎస్., చొరవతో, కేజిహెచ్ ఆసుపత్రి సూపరంటెండెంట్ మరియు ఇతర వైద్యుల సహకారంతో నగర పోలీసు సిబ్బంది యొక్క కుటుంబ సభ్యులకు ఈ రోజు ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం జరిగినది. సుమారు 3000 కు పైగా, హెూం గార్డ్ నుండి మొత్తం నగర పోలీసు సిబ్బంది కుటుంబ సభ్యులు అందరికీ నెల రోజుల పాటూ కేజిహెచ్ ఆసుపత్రి నందు నిర్వహించబోవు ఈ ఆరోగ్య పరీక్షలను ఈ రోజు పోలీసు కమిషనర్, ప్రారంభించడం జరిగినది. ఈ సందర్భంగా సిపి గారు మాట్లాడుతూ సిబ్బంది కుటుంబ సభ్యులకు ఆరోగ్య పరీక్షల నిర్వహించాలని నేను చేసిన వినతికి సానుకూలంగా స్పందించిన కేజిహెచ్ ఆసుపత్రి సూపరంటెండెంట్ ఈ రోజు ఈ సంక్షేమ కార్యక్రమం ప్రారంభించడం జరిగినది. పోలీసులు పగలూ రాత్రీ విధులు నిర్వహిస్తూనే ఉంటారు, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపే బాధ్యత మా పై ఉన్నదీ, అది మా కర్తవ్యం. ఇప్పటికే పోలీసు సిబ్బంది ఆరోగ్యం నిమిత్తం గత రెండు నెలలుగా ప్రతీ రోజూ ప్రతీ స్టేషన్ నందు , ఏ.ఆర్ నందు అందుబాటులో ఉన్న సిబ్బందికి యోగా నిర్వహించడం జరుగుతుంది, అదే విధముగా ఉభకాయం నుండి పోలీసు సిబ్బంది దూరముగా ఉండేందుకు ప్రతీ ఒక్క పోలీసు సిబ్బందికి వారు ఉద్యోగం నిర్వహించే సమీప పోలీసు కార్యాలయం వద్ద బి. ఎం.ఐ ప్రతీ నెలా నిర్వహించడం జరుగుతుంది, అందులో భారీ ఊబకాయం, ఎక్కవ బరువు కల వారికి పొద్దున్న వేళలలో వారికి సరిపడా వ్యాయామాలు నిపుణులచే నిర్వహించడం జరుగుతుంది, ప్రతీ నెలా ఆరోగ్యం పట్ల ఉత్తమ శ్రద్ధ కనబరచి బి. ఎం.ఐ మెరుగుపరుచుకున్న సిబ్బందికి ఆ నెల జరుగు క్రైమ్ మీటింగ్ నందు సత్కరించడం జరుగుతుంది. అదే విధముగా సిబ్బంది మరియు వారి కుటుంబ సభ్యుల వైద్య పరీక్షలు వివరాలు డిజిటల్ రూపంలో పొందుపరచడం జరుగుతుంది. అదేవిధముగా మానసిక ఆరోగ్యం పట్ల పోలీసులు మరింత శ్రద్ధ కనబరచాలి, కుటుంబ సమస్యలు, ఆర్థిక సమస్యలు, మద్యపానం, అప్పు తీసుకోవడం వంటి ఇతర సమస్యల వల్ల కూడా మానసిక సమస్యలతో బాధపడుతున్న వారి కోసం వారి కుటుంబ సభ్యులు గుర్తించి మాకు తెలియ జేస్తే మేము మీ పేరు బయటకు రాకుండా వారికి తగు చికిత్స అందజేస్తామని తెలిపారు. పోలీసు కుటుంబ సభ్యులకు , యెటువంటి సమస్యలు ఉన్నా తాము ఇచ్చిన తెలిపారు.

# విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ, పెట్టుబడుల ఉపసంహరణను పునఃపరిశీలించాలని వినతిపత్రం



విశాఖపట్నం వార్త మిర్రర్ : ఢిల్లీలో కేంద్ర ఉక్కు మరియు భారీ పరిశ్రమల శాఖమంత్రి హెచ్.డి.కుమారస్వామిని కలిసి విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ, పెట్టుబడుల ఉపసంహరణను పునఃపరిశీలించాలని వినతిపత్రం అందజేసిన వైయస్ఆర్ సీపీ ఎంపీల బృందం కుమారస్వామిని కలిసిన వైయస్ఆర్ సీపీ పార్లమెంటరీ పార్టీ నాయకుడు వైవీ సుబ్బారెడ్డి, రాజ్యసభ ఫ్లోర్ లీడర్ వి.విజయసాయిరెడ్డి, లోక్‌సభ ఫ్లోర్ లీడర్ పి.వి.మిథున్ రెడ్డి, ఎంపీలు పిల్లి సుభాష్ చంద్రబోస్, గొల్ల బాబూరావు, ఆళ్ళ అయోధ్యరామిరెడ్డి, మద్దిల గురుమూర్తి, మేడా రఘునాధ్ రెడ్డి, గుమ్మ తనూజా రాణి. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కుగా భావించే విశాఖ స్టీల్ ప్లాంట్‌కు సంబంధించి క్యాప్టివ్ మైనింగ్ లేకపోవడం ప్రధాన అడ్డంకిగా మారింది, తద్వారా లాభదాయకతను ప్రభావితం చేస్తుందని కేంద్రమంత్రికి తెలిపిన వైయస్ఆర్ సీపీ ఎంపీలు విశాఖ ఉక్కు టర్న్ అరౌండ్ సాధించడానికి అవసరమైన చేయూత కేంద్రం అందించాలని వినతిపత్రంలో కోరిన ఎంపీలు, మరో రెండేళ్ళపాటు కేంద్రం నుంచి చేయూత అందితే ఆర్థిక పరిస్థితి మెరుగువుతుందన్న ఎంపీలు ఇన్‌పుట్ ఖర్చులను తగ్గించడానికి వీలుగా ఆర్ఐఎన్ఎల్ కు క్యాప్టివ్ మైన్‌లను కేటాయించడం ద్వారా వ్యయప్రతికూలతలను అధిగమించేందుకు సహాయపడుతుందని, కేంద్రం సహకారం అందిస్తే ప్లాంట్ మళ్ళీ లాభదాయకమైన వెంచర్‌గా మారుతుందని కేంద్ర మంత్రికి తెలిపిన ఎంపీలు ఆర్థిక పునర్నిర్మాణానికి కేంద్రం సాయపడాలని విజ్ఞప్తి, తమ విజ్ఞప్తిపై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారన్న వైయస్ఆర్ సీపీ ఎంపీల బృందం, వచ్చే కేబినెట్ లో ఈ ప్రతిపాదనలు పెడతానని హామీ ఇచ్చారన్న ఎంపీలు.



# గురుకుల, పాఠశాల విద్యను సంక్షోభంలోకి నెట్టిన ప్రభుత్వం

దేవరకొండ డిసెంబర్ 02 వార్త మిర్రర్ : గురుకుల, పాఠశాల విద్యను ప్రభుత్వం సంక్షోభంలోకి నెట్టడం జరిగింది అని బిఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షులు స్వామి యాదవ్, వేముల రాజు లు అన్నారు. సోమవారం గురుకుల బాట కార్యక్రమంలో భాగంగా కొండబిమనపల్లి బీసీ బాలుర గురుకుల పాఠశాల, మైనార్టీ బాలుర గురుకులను, దేవరకొండ పట్టణంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను బిఆర్ఎస్వీ ఆద్వర్యం సందర్శించం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ........11 నెలల్లో 52 మంది విద్యార్థుల మరణించడం జరిగింది అని తెలిపారు. పాలన గాలికొదిలేసి నేరపూరిత నిర్లక్ష్యంతో విద్యార్థులను పొట్టన బెట్టుకుంటున్న ముఖ్యమంత్రి అని అన్నారు. విద్యార్థులు చనిపోతున్నా ఒక్క సమీక్ష కూడా నిర్వహించని ప్రభుత్వానికి ఉసురు తప్పదు అని అన్నారు. శీతాకాలం ప్రారంభం అయిన నేటికీ విద్యార్థులకు అందించని దుపట్లు అని తక్షణమే అందించాలని కోరారు. రాష్ట్రంలో 934 మంది విద్యార్థులు ఫుడ్ పాయిజన్ కు గురి అయ్యారు అని తెలిపారు. సంవత్సరం నుండి తెలంగాణలో విద్యా, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రులు లేరు అని అన్నారు. రాష్ట్రంలో గురుకుల విద్యావ్యవస్థ కుప్పకూలింది అని అన్నారు. కేసీఆర్ హయాంలో గురుకుల విద్యావ్యవస్థ ఆదర్శంగా నిలిచింది అని గుర్తు చేశారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థ ధ్వంసం అయింది అని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక గురుకులాల వ్యవస్థను నీరు గారుస్తున్నారు అని అన్నారు. గురుకులాల్లో ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, బీసీ విద్యార్థులు ఎక్కువగా చదువుతున్నారు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ, బిఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శిలు బొమ్మనబోయిన నాగార్జున, కట్ట శ్రీను, మిథున్, బిఆర్ఎస్వీ దేవరకొండ మండల అధ్యక్షుడు పాత్లవత్ లక్ష్మణ్, యువజన విభాగం పట్టణ అధ్యక్షులు పొట్ట మదు, వింజమూరి వెంకటేష్, గుండాల వెంకట్, జమీర్ బాబా, శ్రీను నాయక్, అభి తదితరులు ఉన్నారు.



# చౌటుప్పల్‌లో ది ప్రెస్ క్లబ్‌కు స్థలం కేటాయించాలి

### జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

### ఐజేయూ జిల్లా ఉపాధ్యక్షుడు, ది ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు దోనూరు రాంరెడ్డి

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి డిసెంబర్ 02 : చౌటుప్పల్ డివిజన్ కేంద్రంలో అందరికీ ఉపయోగకరంగా ఉండే విధంగా ది ప్రెస్ క్లబ్ భవనం నిర్మాణం కోసం 5 గుంటలు (605 గజాలు) ప్రభుత్వ స్థలమును కేటాయించాలని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) యాదాద్రి భువనగిరి జిల్లా ఉపాధ్యక్షుడు, ది చౌటుప్పల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు దోనూరు రాంరెడ్డి కోరారు. చౌటుప్పల్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం జరిగిన ది ప్రెస్ క్లబ్ సమావేశంకు రాంరెడ్డి అధ్యక్షత వహించి మాట్లాడుతూ..ది చౌటుప్పల్ ప్రెస్ క్లబ్ రిజిస్ట్రేషన్ నెంబర్ 506/2021 సంవత్సరంలో ఏర్పడి రిజిస్ట్రేషన్ పొందినదని తెలియజేశారు. ఆనాటి నుండి విలేకరులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై పోరాడుతూనే ఉన్నామని తెలియజేశారు . కొంతమంది కావాలని చేస్తున్న తప్పుడు ప్రచారాలను ఇప్పటికైనా మానుకోవాలని సూచించారు. వర్కింగ్ జర్నలిస్టులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై ఐజేయూ యూనియన్ ఆధ్వర్యంలో గత కొన్ని దశాబ్దాలుగా చేస్తున్న పోరాటాల ఫలితంగా అక్రిడేషన్ కార్డులు, జర్నలిస్టుల కుటుంబాలకు హెల్త్ కార్డులు, కొంతమందికి ఇళ్ల స్థలాలు ఇవ్వడం జరిగిందన్నారు. ప్రస్తుతం హెల్త్ కార్డులు ఒక నిమ్స్ ఆస్పత్రిలో తప్ప మరెక్కడ పనిచేయడం లేదన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా నిరంతరం పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలు ఇవ్వాలని, హెల్త్ కార్డులు అన్ని ఆస్పత్రుల్లో పనిచేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, జర్నలిస్టులకు గౌరవ వేతనం, పింఛన్ సౌకర్యం కల్పించాలని, జర్నలిస్టులందరికీ అక్రిడేషన్ కార్డులు ఇచ్చి, ఫ్రీ బస్సు పాస్ సౌకర్యం కల్పించాలని, జర్నలిస్టుల వాహనాలకు టోల్ ప్లాజా ల వద్ద టోల్ మినహాయింపు ఇవ్వాలని యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు, ది ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు దోనూరు రాంరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ది ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షుడు ఎర్రసాని సతీష్ యాదవ్, ప్రెస్ క్లబ్ నాయకులు సింగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, దోనూరు జగన్ రెడ్డి, ఊదరి శ్యామ్, ఊదరి శంకర్, లింగానాయక్, బొమ్మ మల్లేష్, పల్లపు కృష్ణ, ఊదరి స్వామినాథం, ఆరుట్ల లింగస్వామి, కొండమడుగు శ్రావణ్ కుమార్, అంజద్ అలీ, సుర్వి కిరణ్, తోనేశ్వర్, భగవత్, అరిగే శ్రీను పాల్గొన్నారు.



## శ్రీ కంఠమహేశ్వర స్వామి దేవాలయం వద్ద అయ్యప్ప స్వాములకు అన్న ప్రసాద వితరణ

సంస్థాన్ నారాయణపూర్ డిసెంబర్ 2:( వార్త మిర్రర్) : నారాయణపురం మండల కేంద్రంలోని శ్రీ కంఠమహేశ్వర స్వామి సుర మాంబా దేవి బ్రహ్మోత్సవాల ముగింపు వేడుకల సందర్భంగా దేవాలయం వద్ద అయ్యప్ప స్వాములకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగినది. ఈ యొక్క కార్యక్రమంలో కంఠమహేశ్వర స్వామి దేవాలయం అధ్యక్షుడు రాపర్తి కరుణాకర్ గౌడ్ గౌడ సంఘం అధ్యక్షుడు బద్దం యాదయ్య గౌడ్ గీతా పనివాళ్ల సంఘం అధ్యక్షుడు నీళ్ల గాలయ్య గౌడ్ మరియు గురు స్వాములు సోమన బోయిన ఐలయ్య గురుస్వామి చిలువేరు జంగయ్య దూసరి వెంకటేష్ గౌడ్ చిలువేరు యాదయ్య పందుల కార్తీక్ గౌడ్ బొమ్మల రఘు గౌడ్ జనగాం శీను మరియు అయ్యప్ప స్వామి భక్తులు పాల్గొన్నారు.



## రైతుల సంక్షేమానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పెద్దపేట

### చిన్న గోల్కొండ పిఎసిఎస్ చైర్మన్ బొమ్మ దవణాకర్ గౌడ్

వార్త మిర్రర్ శంషాబాద్ : రైతుల సంక్షేమానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని చిన్న గోల్కొండ పిఎసిఎస్ బొమ్మ దవణాకర్ గౌడ్ అన్నారు. సోమవారం శంషాబాద్ మండల పరిధిలోని చిన్న గోల్కొండ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లో వివిధ గ్రామాలకు చెందిన రైతులకు వెంకటేష్, లక్ష్మారెడ్డి, మామిళ్ళ కుమార్, కట్ట సురేందర్, శంకరయ్య, అనే రైతులకు 1801000/- రూపాయల చెక్కులను బొమ్మ దవణాకర్ గౌడ్ చేతుల మీదుగా చెక్కులు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు ఏనుగు దేవేందర్ రెడ్డి, మంచర్ల మోహన్ రావు, ప్రశాంత్ రెడ్డి, బాల్య నాయక్, రూప విజయలక్ష్మి, సీఈవో యాదయ్య, సిబ్బంది సురేష్, మధుమతి, జగపతిబాబు, తదితరులు పాల్గొన్నారు.



## భక్తజన కల్పవల్లి శ్రీ శ్రీ శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి పూజా కార్యక్రమంలో పాల్గొన్న దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ వంశీకృష్ణ శ్రీనివాస్

### అమ్మవారికి ప్రత్యేక పూజ అభిషేకం నిర్వహించిన ఎమ్మెల్యే

విశాఖపట్నం వార్త మిర్రర్ : మార్గశిరమాసోత్సవ వేడుకలను జ్యోతి ప్రజ్వలన చేసి, సంప్రదాయబద్ధంగా ప్రారంభించిన ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ భక్తజన కల్పవల్లి శ్రీశ్రీశ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి మార్గశిర మాసోత్సవం ప్రారంభం సందర్భంగా ఈరోజు దక్షిణ నియోజకవర్గం శాసనసభ్యులు శ్రీ వంశీకృష్ణ శ్రీనివాస్ అమ్మవారి ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ ఈవో శ్రీమతి శోభారాణి మరియు సిబ్బంది ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ కి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయ అర్చకులు ప్రత్యేక పూజ నిర్వహించి , అమ్మవారికి పసుపు ,కుంకుమ, పాలు మరియు పూలతో అభిషేకం నిర్వహించి హారతి ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ ఈరోజు ర నుంచి 30వ తేదీ వరకు అంగరంగ వైభవంగా అమ్మవారి సేవలో అనేక మంది భక్తులు పాల్గొంటారని, అమ్మ వారి సేవలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. అమ్మవారి దేవాలయం మరింత అభివృద్ధితో, పాటు భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పించుటకు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, తెలిపారు . కార్పొరేటర్లు, కూటమి వార్డు అధ్యక్షులు, కూటమి శ్రేణులు నాయకులు, ఆలయ ఎఈవో తిరుమాళేశ్వర రావు, ఈ ఈ రమణ పాల్గొన్నారు.



## ప్రజా పాలన విజయోత్సవాలకు ప్రభుత్వ కార్యాలయాలు పలు కూడలిలు విద్యుత్ దీపాలతో అలంకరణ

మిర్యాలగూడ డిసెంబర్ 2:- (వార్త మిర్రర్ ప్రతినిధి) రాష్ట్ర ప్రభుత్వ ఏడాది పాలన పూర్తైన సందర్భంగా ప్రభుత్వ ఆదేశాలతో పట్టణంలో కొన్ని ప్రభుత్వ కార్యాలయాలు, మునిసిపాలిటీ, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. విజయోత్సవాలు ఈ నెల 3 నుండి 9వరకు నిర్వహిస్తున్నామని ఇందులో భాగంగా కార్యాలయాలు, కొన్ని జాతీయ నేతల విగ్రహాలను విద్యుద్దీపాలతో అలంకరించామని మున్సిపల్ కమిషనర్ ఎండీ. యూసుఫ్ తెలిపారు. ఈ నెల 4న ఐఎంఎ భవనంలో ఉచిత వైద్య శిబిరం, వాడల్లో రంగోలి నిర్వహిస్తామని ఆయన తెలిపారు. అదేవిధంగా 6న ప్రకాష్ నగర్, బంగారుగడ్డ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించన్నున్నట్టు ఆయన తెలిపారు. ఆయా కార్యక్రమాలు విజయవంతం చేసేందుకు 48 వార్డులకు నోడల్ ఆఫీసర్లు, సూపర్వైజర్ ఆఫీసర్లను నియమించినట్టు ఆయన తెలిపారు. ఆయన వెంట శానిటరీ ఇన్స్పెక్టర్ వెంకటరమణ, పర్యావరణ ఇంజనీర్ శ్వేత, జెఎ శంకర్ లున్నారు.

# "వార్త మిర్రర్" కథనానికి స్పందించిన దేవరకొండ మున్సిపల్ కమిషనర్

- అక్రమ నిర్మాణాలను నిలిపివేయాలని నోటీసులను పంపుతామన్న కమిషనర్
- అనుమతుల ప్రకారంమే నిర్మాణాలు చేపట్టాలి.. నియమ నిబంధనలను ధిక్కరిస్తే ప్రభుత్వ పరమైన చర్యలు
- వార్త మిర్రర్ విలేకరితో దేవరకొండ మున్సిపల్ కమిషనర్ వై.సుదర్శన్



దేవరకొండ డిసెంబర్ 02 వార్త మిర్రర్ : దేవరకొండ పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు అనే కథనంతో ఆదివారం నాడు వార్త మిర్రర్ తెలుగు దినపత్రిక వెలువడిన కథనానికి దేవరకొండ మున్సిపల్ కమిషనర్ వై.సుదర్శన్ స్పందించారు. దేవరకొండ పట్టణంలో స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నాడు మున్సిపల్ కమిషనర్ వై.సుదర్శన్ వార్త మిర్రర్ విలేకరితో మాట్లాడుతూ ఆదివారం నాడు వార్త మిర్రర్ తెలుగు దినపత్రిక లో వెలువడిన కథనానికి ఆయన స్పందిస్తూ పట్టణంలోనీ డిండి రోడ్ లో మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు ఇచ్చిన అనుమతుల ప్రకారం నిర్మాణం చేపట్టాలని నిబంధనలు ఉన్న వాటిని తుంగలో తొక్కేస్తూ నియమ నిబంధనలు ప్రకారం నిర్మాణం చేపట్టకపోతే నిర్మాణం చేపట్టే వారికి నోటీసులు పంపిస్తామని దేవరకొండ మున్సిపల్ కమిషనర్ అన్నారు. పట్టణంలో నిర్మాణం చేపట్టేవారు మున్సిపాలిటీ పరిధిలోని టౌన్ ప్లానింగ్ అధికారి ఇచ్చిన అనుమతుల ప్రకారమే నిర్మాణం చేపట్టాలని లేనియెడల వారిపై కఠిన చర్యలు ఉంటాయని వారు తెలిపారు. మున్సిపాలిటీ నియమ నిబంధనల ప్రకారం నిర్మాణం చేపట్టకపోతే, ప్రస్తుతం జరిగే నిర్మాణాలకు అనుమతులు లేకుండా నిర్మాణం చేపట్టిన ప్రభుత్వ పరమైన కఠిన చర్యలు ఉంటాయని వారు తెలియజేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2019 టీఎస్ చట్టం ప్రకారం నిర్మాణం నిలిపివేసి అధికారం మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ అధికారులకు ఉంటుందని ఆయన తెలియజేశారు.


6 వార్త మిర్రర్ సోమవారం, డిసెంబర్ 2, 2024

దేవరకొండలో నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు

పట్టించుకోని జిల్లాస్థాయి అధికారులు

ప్రభుత్వ నియమ నిబంధనలు పాటించకుండా అక్రమ నిర్మాణం

తూతూ మంత్రంగా అనుమతులు అడ్డుకొని అధికారులు

అక్రమ నిర్మాణాలకు దాసోహమైన సంబంధిత అధికారులు

అనుమతుల పత్రంలో కంటే భిన్నంగా నిర్మాణాలు

చోద్యం చూస్తున్న మున్సిపల్ అధికారులు ఉన్నతాధికారులు

పట్టణవాసులు ప్రభుత్వ నియమ నిబంధనలు ప్రకారమే నిర్మాణాలు చేపట్టాలని అధికారులకు సహకరించాలని వారు తెలిపారు. పట్టణంలోని కొన్ని కాలనీలలో ప్రభుత్వపరమైన అనుమతులు లేకుండా వారి ఇష్టానుసారంగా గతంలో నిర్మాణాలు చేపట్టిన వారు వెంటనే ప్రభుత్వపరమైన అనుమతులు తీసుకోవాల్సిందిగా వారు తెలియజేశారు.




## పిహెచ్డి పట్టా పొందిన రవీందర్ నాయక్‌ను సత్కరించిన ఎమ్మెల్సీ కవిత

దేవరకొండ డిసెంబర్ 02 వార్త మిర్రర్ : కాకతీయ యూనివర్సిటీలో పొలిటికల్ సైన్స్ డిపార్ట్మెంట్లో మై టాపిక్ ఇండో-యూఎస్ రిలేషన్ ఫ్రమ్ డైవర్షన్స్ టు స్ట్రాటిజిక్ అలైన్స్ లో పీహెచ్డీ పట్టా అందుకున్న దేవరకొండ నియోజకవర్గం నేరేడు గొమ్ము మండలం పెద్ద మునిగాల్ గ్రామానికి చెందిన కేతావత్ రవీందర్ నాయక్ హైదరాబాదులో సోమవారం నాడు తెలంగాణ జాగృతి జాతీయ అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ను మర్యాదపూర్వకంగా వారి స్వగృహంలో కలిశారు. అనంతరం కాకతీయ యూనివర్సిటీలో పొలిటికల్ సైన్స్ లో పీహెచ్డీ అందుకున్న కేతావత్ రవీందర్ నాయక్ ను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ కేతావత్ రవీందర్ నాయక్ వారి జీవితంలో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారికి గౌరవప్రదమైన పట్టాలు అవార్డులు ఎన్నో అందుకోవాలని ఆమె ఆకాంక్షించారు. ఎక్కడో మారుమూల ప్రాంతంలో గిరిజన కుటుంబం నుండి వచ్చి కాకతీయ యూనివర్సిటీ లో పీహెచ్డీ పట్టా అందుకోవడం గొప్ప గర్వకారణం అని ఆమె అన్నారు.

# గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో ఉపాధ్యాయులను యుద్ధ ప్రాతిపదికన నియమించాలి

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి డిసెంబర్ 2 : జగిత్యాల జిల్లా మారుమూల మండలాలలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో ప్రభుత్వ ఉపాధ్యాయులను యుద్ధ ప్రాతిపదికన నియమించాలి. జగిత్యాల జిల్లా ఏర్పడి దాదాపు 10 సంవత్సరాలు గడుస్తున్నా గిరిజన ఆశ్రమ వసతి గృహాల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్లు ఉంది. ఒకవైపు ప్రభుత్వము మారి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి సంవత్సరం గడిచి సంబరాలు జరుపుతున్నప్పటికిని జిల్లా గిరిజన సంక్షేమశాఖ పరిస్థితి అంతంతమాత్రంగానే ఉన్నది. మొత్తం ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుండే కార్యకలాపాలు జరుపుతూ జగిత్యాల జిల్లాలో సంపూర్ణ గిరిజన సంక్షేమశాఖ అధికారి గాని, సెక్షన్ గాని పూర్తిగా లేకపోవడం శోచనీయం. జగిత్యాల జిల్లాలో గోండు గూడెంలను ఆనుకొని 1975లో ప్రారంభం కాబడిన ఆశ్రమ పాఠశాలల్లో ఇప్పుడు ప్రభుత్వ ఉద్యోగులు లేక, జిల్లా మొత్తానికి ఇద్దరే ప్రభుత్వ ఉపాధ్యాయులు ఉండి రాయికల్ మండలంలోని జగన్నాథుపూర్ ఆశ్రమ పాఠశాల, బీర్పూర్ మండలంలోని చిత్రవేణిగూడెం, మంగేళ ఆశ్రమ పాఠశాలల్లో సి.ఆర్.టి.లు మాత్రమే విద్యాబోధన చేస్తున్నారు. మొన్నటి డిఎస్సీ ఎంపికలో గిరిజన సంక్షేమశాఖకు పరిపూర్ణ ఉపాధ్యాయులను ఉంచకపోగా ఉన్న ఇద్దరికి ఒకరికి రెండు హాస్టళ్ల ఇంచార్జి ఇవ్వడమంటే బీర్పూర్ మండలం చిత్రవేణిగూడెం నుండి రాయికల్ మండలంలోని ద్వీపకల్ప గ్రామమైన జగన్నాథ్పూర్ ఆశ్రమ పాఠశాల వార్డెన్కు ఇంచార్జి ఇవ్వడం వ్యయ ప్రయాసలకు ఓర్చి వారు విధులు నిర్వహిస్తున్నారు. కాగా, ప్రక్కన గల ఖానాపూర్ నియోజకవర్గం చెందిన వెడమ బొజ్జు ఆదివాసీ ఎమ్మెల్యే దృష్టికి ఆదివాసీ గోండు ప్రజలు తీసుకెళ్ళగా వారు తెలంగాణ కమీషనర్ కు లేఖలు వ్రాయడం జరిగింది. కానీ, స్థానిక ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉన్నప్పటికిని అట్టి ఆశ్రమ పాఠశాలల పరిస్థితిని గమనించి ఉపాధ్యాయులను కేటాయించ వలసి ఉండగా, ఆదిలాబాద్ జిల్లాలో అధికంగా నియమితులైన కొందరు ఉపాధ్యాయులు డిప్యుటేషన్పై కూడా ఈ జిల్లాలోని ఈ పాఠశాలలకు రావడానికి సుముఖంగా ఉన్నప్పటికిని ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదు. ఇకనైన గిరిజన సంక్షేమ శాఖపై ప్రత్యేక శ్రద్ధ వహించి పూర్తి సిబ్బందితో కూడిన కార్యాలయంను నిర్వహిస్తూ, ఈ గిరిజన గ్రామాల్లో మౌళిక వసతులపై దృష్టి సారించాలని విన్నవిస్తున్నాము అని ఆదివాసీ దళిత హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు కురిసెంగ వేణు ఒక ప్రకటనలో తెలిపారు.


DISTRICT LEVEL VIGILANCE & MONITORING PREVENTION OF SC, ST. ATTROCITY COMMITTEE JAGTIAL DISTRICT

Kurisenga Venu B.A.L
Member :
Protection of SC, ST. Attrocity

H.No. 2-40/A1
Near Ayyappa Temple
RAIKAL (Vil & Mdl)
Dist: Jagtial-505 460
Cell: 9542562515

Ref: Date: 02/12/2024

పత్రికా ప్రకటన

గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో ప్రభుత్వ ఉపాధ్యాయులను యుద్ధ ప్రాతిపదికన నియమించాలి



## మిర్యాలగూడలో సిపిఎం ఆధ్వర్యంలో భారీ ర్యాలీ ::: పాల్గొన్న రెడ్ షర్ట్ వాలంటీర్లు

మిర్యాలగూడ నవభూమి, డిసెంబర్ 2:-( వార్త మిర్రర్ ప్రతినిధి) మిర్యాలగూడలో పట్టణంలో సోమవారం సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి నాయకత్వంలో సిపిఎం జిల్లా 21వ మహాసభల్లో భాగంగా సోమవారం బహిరంగ సభ జరుగుతున్న సందర్భంగా హనుమాన్ పేట చౌరస్తా నుంచి ఎన్ఎస్పి క్యాంపు రాజీవ్ గాంధీ స్టేడియంలోని బహిరంగసభ ప్రాంగణం వరకు సిపిఎం ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. డప్పు, కోలాట కళాకారుల ప్రదర్శనతో ఆటపాటలతో మధ్య ర్యాలీ బహిరంగసభ ప్రాంగణానికి చేరుకుంది. జిల్లా నలుమూలల నుండి అన్ని వర్గాల ప్రజలు తరలివచ్చారు. ర్యాలీలో సిపిఎం పోలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు, కేంద్ర కమిటీ సభ్యులు సీతారాములు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మల్లు లక్ష్మి, సిపిఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్రెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు తుమ్మల వీరారెడ్డి, నారి ఐలయ్య, డబ్బికార్ మల్లేష్, జిల్లా కమిటీ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, రవినాయక్, డాక్టర్ మల్లు గౌతంరెడ్డి, భవాండ్ల పాండు, సిపిఎం వేములపల్లి మండల సీనియర్ నాయకులు పరశురాములు, డివైఎఫ్ఐ జిల్లా నాయకులు అంజాద్, రవినాయక్, సిపిఎం టూ టౌన్ సహాయ కార్యదర్శి అయూబ్, శశిధర్రెడ్డి, జగదీష్ చంద్ర, మంగారెడ్డి, వీరాచారి, వాడపల్లి రమేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రమేష్ ఖమ్మంపాటి శంకర్, సైదా నాయక్, నాయకులు రొండి శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ప్రజలకు పేదరికం... కార్పోరేట్లకు కోట్ల ఆదాయం



### ఒన్ నేషన్ - ఒన్ ఎలెక్షన్ తో ప్రజాస్వామ్యం నాశనం

### అగ్రిస్పాట్‌తో రైతులు కూలీలుగా మారే అవకాశం

### సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు రాఘవులు



మిర్యాలగూడ డిసెంబర్ 2:-( వార్త మిర్రర్ ప్రతినిధి) ప్రధాని మోడి విధానాల వల్ల భవిష్యత్తులో దేశానికి ముప్పు వాటిల్లుతుందని సీపీఎం పోలిట్బ్యూరో సభ్యుడు బీవీ.రాఘవులు అన్నారు.సీపీఎం నల్లగొండ జిల్లా 21వ మహాసభల సందర్భంగా సోమవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో వేలాది మందితో మహా ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఎన్ఎస్పీ క్యాంపులో జరిగిన మహా ప్రదర్శనలో కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి. మల్లు లక్ష్మీలతో కలిసి బహిరంగసభలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు ఉద్యమాల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకొస్తామన్నారు. దేశ సంపదను కొల్లగొట్టి పది మంది కార్పోరేట్లకు కోట్లాది రూపాయలను అప్పనంగా అప్పజెప్తున్నాడని, ప్రజలకు మాత్రం పేదరికం వచ్చేలా విధానాలను అనుసరిస్తున్నారని ధ్వజమెత్తారు. రైతు చట్టాలను రద్దు పన్నారని ధ్వజమెత్తారు. గతంలో ఢిల్లీలో రైతులు ఉద్యమం చేపట్టగా మోడి వెనక్కి తగ్గారని, ఆ సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు మరోమారు రైతులు ఢిల్లీ బాట పడుతున్నారని చెప్పారు. రైతులకు కనీసం గిట్టుబాటు ధర చట్టం తేవాలని, సంక్షోభం నుంచి వ్యవసాయాన్ని కాపాడాలని, ఢిల్లీ ఆందోళనలో అమరులైన రైతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని, ఆ సమయంలో రైతులపై పెట్టిన అక్రమకేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. మోడి విధానాల వల్ల రైతులు దివాలా తీస్తున్నారని, అప్పులు,ఆత్మహత్యలు పెరిగి గ్రామాలను వదిలి పట్టణాలకు వలస వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేదల కష్టార్జితంతోనే అంబాని తన కొడుకు పెళ్లికి రూ.4వేల కోట్లు ఖర్చు పెట్టాడని విమర్శించారు. విద్యుత్ భారాలను పేదలపై మోపేందుకు గతంలో అదాని తెలంగాణాకురూ.2029కోట్లు, ఆంధ్రాకు రూ.1750కోట్లు లంచంగా ఇచ్చాడని ఆరోపించారు. రూ.2 యూనిట్‌కు దొరికేవిద్యుత్ రూ.2.49 పెట్టి జగన్ ఒప్పందం చేసుకన్నాడని, అందుకే ఆ ఒప్పందం చేసుకున్నాడని ఆరోపించారు. దేశంలో ఏ ఒక్క రాజకీయ పార్టీ నిజాయితీగా లేదని, సీపీఎం పార్టీ మాత్రమే పేదల కోసం నిజాయితీగా పనిచేస్తుందన్నారు. రాబోయే కాలంలో మోడి ప్రభుత్వం భూములను కార్పోరేట్ శక్తులకు అప్పజెప్పేందుకు అగ్రిస్పాట్ పథకాన్ని తీసుకొచ్చేందుకు యత్నిస్తున్నాడని, దీని ద్వారా రైతు ఐడీ కార్డుతో భూమికి అనుసంధానం చేసి కంప్యూటీకరణ చేసి కొనుగోలు, అమ్మకాలు సులువుగా జరిగేందుకు వెసులుబాటు కల్పిస్తున్నారని అన్నారు. దానివల్ల బలహీనమైన రైతులకు ఆశచూపి ఆ భూములను లాక్కొనే ప్రయత్నం చేస్తున్నాడని, దీంతో భవిష్యత్తులో రైతులు కూలీలుగా మారే ప్రయత్నం చేస్తుందన్నారు.రాష్ట్రాలకు హక్కులు లేకుండా మోడి కొత్త చట్టాలు తీసుకొస్తున్నారని, దాని ద్వారా రాష్ట్ర ప్రభుత్వాలు మున్సిపాలిటిలుగా మారే ప్రమాదం ఉందన్నారు. ఒకే దేశం, ఒకే ఎన్నిక విధానం ద్వారా స్థానిక సంస్థలు నిర్వీర్యం కావడంతోపాటు ప్రాంతీయ పార్టీలు కనుమరగవుతాయని గుర్తు చేశారు. ఆ సమయంలో లౌకికవాదం, సామ్యవాదం, ఫెడరలిజం ఖూనీ అవుతుందన్నారు. వాటిని రక్షించుకునేందుకు సీపీఎం ప్రజా పోరాటాలు నిర్వహించేందుకు సిద్ధమవుతుందన్నారు. ప్రజలు తిరగబడితే ప్రభుత్వాల మనుగడ కష్టమని, ఇటీవల శ్రీలంక, నేపాల్‌లో జరిగిన పరిణామాలే ఉదాహరణ అన్నారు. లగచర్లలో ఫార్మాకంపెనీ రద్దు కమ్యూనిస్టులు ముందుండి పోరాడడం వల్లనే సాధ్యమైందని గుర్తు చేశారు. ప్రజా ఉద్యమాలు నిర్వహించి బలమైన శక్తిగా ఎదుగుతామని,ఎర్రజెండాకు పూర్వ వైభవం తేవాలని పిలుపునిచ్చారు.సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తుమ్మల వీరారెడ్డి, నారి ఐలయ్య, డబ్బికార్ మల్లేష్, సయ్యద్ హాసం, కందాల ప్రమీల, ప్రభావతి, నాగార్జున, లక్ష్మీనారాయణ, కూన్‌రెడ్డి నాగిరెడ్డి, బండా శ్రీశైలం, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



# మహిళా సాధికారతే ప్రభుత్వ ధ్యేయం

## ప్రజా పాలన విజయోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బాలు నాయక్





దేవరకొండ డిసెంబర్ 02 వార్త మిర్రర్ : ప్రజా పాలన విజయోత్సవాలలో భాగంగా నేడు దేవరకొండ పట్టణంలోని సాయి శివ ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన స్త్రీ నిధి, బ్యాంక్ లింకేజి, వడ్డీ లేని రుణాలు, ఇందిరా మహిళా శక్తి పథకాల ద్వారా 140కోట్ల రూపాయల విలువ గల చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేసిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అనంతరం ఎమ్మెల్యే ని శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సాధికరతే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తున్నదని, సమాజంలో పురుషులకు దీటుగా అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పిస్తున్న ఘనత సీఎం రేవంత్ రెడ్డిదేనని దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్ అన్నారు.గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సంఘాల్లోని మహిళలకు వడ్డీలేని రుణాలు, ఇందిరమ్మ గృహాలను మహిళల పేరిట మంజూరు చేయడంతో పాటు అనేక సంక్షేమ పథకాలను అమలు చేసిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వాటిని నిర్వీర్యం చేసి మహిళలకు అన్యాయం చేసిందని తెలిపారు. ప్రస్తుతం తమ ప్రభుత్వం మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు, మహిళల పేరిట ఇందిరమ్మ గృహాల మంజూరును పునరుద్ధరించిందని చెప్పారు. సాంకేతిక కారణాలతో రుణాలు మాఫీ కానీ రైతుల ఖాతాలో రూ.2,747.67 కోట్లు విడుదల చేశామన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణలో ప్రజాస్వామ్యాన్ని పాతరేసిందని ధ్వజమెత్తారు. కనీసం సచివాలయానికి కూడా రాకుండా నియంత పాలన సాగించారని మండిపడ్డారు.రాష్ట్రాన్ని దుర్మార్గంగా పాలించడం వల్లే బీఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లాలో అడ్రస్ లేకుండా పోయిందన్నారు.ధనిక రాష్ట్రాన్ని గత బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పుల కుప్పగా మార్చిందని ఎమ్మెల్యే విమర్శించారు. ఆ అప్పులపై నెలకు రూ.6 వేల కోట్ల వడ్డీలు కట్టాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు.దుర్భర ఆర్థిక పరిస్థితుల్లోనూ అన్నదాతలకు రుణమాఫీ, సన్నాలకు బోనస్ ఇవ్వడంతో పాటు రైతులను నుంచి సకాలంలో ధాన్యం కొనుగోలు చేస్తున్నామని ఎమ్మెల్యే బాలు నాయక్ తెలిపారు. ఇది రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి అని స్పష్టం చేశారు.గతంలో వైఎస్ఆర్ సీఎంగా ఉన్నప్పుడూ లక్షల ఎకరాల ఆయకట్టుకు సంబంధించిన ప్రాజెక్టులు నిర్మించి నల్గొండ జిల్లాను సస్యశ్యామలం చేశారని ఎమ్మెల్యే బాలు నాయక్ కొనియాడారు. అదే స్ఫూర్తితో ఇప్పుడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి,జిల్లా మంత్రులు నల్గొండలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసే బాధ్యతను తీసుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నాయిని జమున మాధవ రెడ్డి, దొంతం అలివేలు సంజీవ రెడ్డి,మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహా, నల్గొండ పార్లమెంట్ కోఆర్డినేటర్ సిరాజ్ ఖాన్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ముక్కామల వెంకటయ్య గౌడ్, పిఎసిఎస్ చైర్మన్లు డాక్టర్ వేణుధర్ రెడ్డి, కొండ్ర శ్రీశైలం యాదవ్,మాజీ జడ్పీటీసీ అరుణ సురేష్ గౌడ్,పలువురు మండల ఎంపీపీలు దూదిపాల రేఖ శ్రీధర్ రెడ్డి,భవాని పవన్ కుమార్,పార్వతి చందు నాయక్, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొంతినేని వేంకటేశ్వర్ రావు, చందంపేట మండల పార్టీ అధ్యక్షులు బాధ్య నాయక్,యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కొర్ర రాంసింగ్ నాయక్, కిన్నెర హరికృష్ణ, మాజీ సర్పంచులు పాప నాయక్,రంగయ్య గౌడ్,లక్ష్మీ, మాజీ ఎంపీటీసీలు గౌతమి,గడ్డం వెంకటయ్య, యువ నాయకులు బాబు రామ్ నాయక్, పీడీ శేఖర్ రెడ్డి, ఆర్డీఓ రమణా రెడ్డి, ఎపిఓ లు,మహిళా సంఘం అధ్యక్షురాలు,నియోజక వర్గ మహిళామణులు తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే బాలు నాయక్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన 13 వార్డు కౌన్సిలర్

దేవరకొండ డిసెంబర్ 02 వార్త మిర్రర్ : దేవరకొండ పట్టణ పరిధిలోని 13వ వార్డు కౌన్సిలర్ పులిజాల లక్ష్మీ శ్రీనివాస్ లు బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి పేదల పెన్నిధి దేవరకొండ శాసన సభ్యులు నేనావత్ బాలు నాయక్ అభివృద్ధి బాటలో నడిచేందుకు బీజేపీ పార్టీని విడి కాంగ్రెస్ పార్టీలో విచ్చేసిన సంధర్భంగా కౌన్సిలర్ లక్ష్మీ,బీజేపీ కార్యవర్గ సభ్యులు శ్రీనివాసులు,బీజేపీ యువ నాయకులు ఆదిత్య లకు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి సాధారణంగా పార్టీలోకి ఆహ్వానించిన దేవరకొండ శాసన సభ్యులు శ్రీ లినేనావత్ బాలు నాయక్.అనంతరం వార్డు కౌన్సిలర్ ఎమ్మెల్యే ని శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభం ఉన్నప్పటికీ అందరికీ సంక్షేమ పథకాలను అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని పేద ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఒకవైపు అభివృద్ధి మరోవైపు సంక్షేమంతో రాష్ట్రం ప్రగతి పథంలో దూసుకుపోతున్నారని అన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ నాయిని జమున మాధవ రెడ్డి,మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహా, నల్గొండ పార్లమెంట్ కోఆర్డినేటర్ సిరాజ్ ఖాన్, పట్టణ మాజీ సర్పంచ్ వేంకటేశ్వర్లు,రాష్ట్ర నాయకులు హన్మంతు వెంకటేష్ గౌడ్,మాజి మార్కెట్ కమిటీ చైర్మన్ ముక్కమల్ల వెంకటయ్య గౌడ్, పిఎసిఎస్ చైర్మన్ డాక్టర్ వేణుధర్ రెడ్డి, శ్రీశైలం యాదవ్,పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు యూనుస్, కౌన్సిలర్లు, పున్నబోయినా భూదేవి సైదులు,మురళీ,థౌఫిక్,యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కిన్నెర హరికృష్ణ,మార్కెట్ కమిటీ డైరెక్టర్ రఘు రాములు , గౌరీ శంకర్,యువ నాయకులు బాబు రామ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# జనవరి 5న ఓయూలో మాదిగ విద్యార్థి గర్జన సభ... ఓయూ విద్యార్థి సంఘాలు



సికింద్రాబాద్, వార్త మిర్రర్ డిసెంబర్ 2 : ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు యొక్క తీర్పు నేపథ్యంలో ఉస్మానియా యూనివర్సిటీలో ఉన్న వివిధ విద్యార్థి సంఘాల విద్యార్థి నాయకులందరూ కలిసి ఎస్సీ వర్గీకరణ అమలుకై జనవరి 5న ఉస్మానియా యూనివర్సిటీలో మాదిగ విద్యార్థి గర్జన సభ ను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీ ఫ్యాకల్టీ క్లబ్ లో నిర్వహించిన విస్తృతస్థాయి సమావేశంలో ఉస్మానియా యూనివర్సిటీలో ఉన్న వివిధ విద్యార్థి సంఘాల విద్యార్థి నాయకులు పాల్గొని మాట్లాడుతూ...భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సూచించిన సమానత్వ సూత్రం ఆధారంగానే జనాభా దమాషా ప్రకారం విద్య ఉద్యోగ ఉపాధి రాజకీయ రంగాలలో సమాన వాట దక్కాలని కోరుతున్నామని అన్నారు. ఎస్సీ వర్గీకరణ జరగకపోవడం వల్లనే 30 ఏళ్ల నుండి మాదిగ-మాదిగ ఉపకుల విద్యార్థులు విద్యా ఉద్యోగ ఉపాధి రంగాల్లో తీవ్రంగా నష్టపోయారన్నారు.భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు కట్టుబడి వర్గీకరణ వ్యతిరేకిస్తున్నటువంటి వారందరూ భారత రాజ్యాంగాన్ని గౌరవించాల్సిన బాధ్యత ఉందన్నారు. ఇప్పటికైనా వర్గీకరణకు సహకరించి అన్నదమ్ముల లాగా కలిసి ఉందామని కోరారు.రాష్ట్ర ప్రభుత్వం కూడా ఎస్సీ వర్గీకరణ విషయంలో కాలయాపన చేయడం తగదని అన్నారు, ఎస్సీ వర్గీకరణ చేపట్టకుండా ఉద్యోగ నోటిఫికేషన్లు భర్తీ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు కాబట్టి ఎస్సీ వర్గీకరణ చేసిన తర్వాతనే ఉద్యోగ నియామకాలు చేపట్టాలని కోరారు.విద్యా ఉద్యోగ ఉపాధి రాజకీయ రంగంలో మాదిగ మాదిగ, ఉపకులాల విద్యార్థులందరికీ న్యాయం జరగాలని ఉద్దేశంతో ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని రాష్ట్రప్రభుత్వం పై ఒత్తిడి చేయడానికి జనవరి 5 న మాదిగ విద్యార్థి గర్జన సభను నిర్వహించనున్నట్లు చెప్పారు. సభను విజయవంతం చేయడానికి రాష్ట్రంలో ఉన్న వివిధ జిల్లాల,నియోజకవర్గాలు,మండలాల నుండి పెద్ద ఎత్తున సభకు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ విద్యార్థి సంఘ నాయకులు పాల్గొన్నారు.



## అక్రమ డిప్యూటేషన్‌లు రద్దు చేయాలి

### బీజేపీ ఎస్సీ మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షులుఅంకూరి నర్సింహా

దేవరకొండ డిసెంబర్ 02 వార్త మిర్రర్ : దేవరకొండ మండలం తాటికోల్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పాఠశాలలో మండల అధ్యక్షుడు పబ్బు సైదులు గౌడ్ తో కలిసి ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది.. ఈ కార్యక్రమంలో అంకురి నర్సింహా మాట్లాడుతూ ఈ యొక్క పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను ఉన్నత అధికారులు డబ్బులు తీస్కొని ఇష్టం వచ్చిన రీతిలో డిప్యూటేషన్ పై వేరే దగ్గరికి పంపించడం వల్ల విద్యార్థులకు పాఠాలు చెప్పే వారు కరువైనారని 10వ తరగతి పరీక్షలు సమీపిస్తున్న వారికి బోధించే ఉపాద్యాయులు లేక విద్యార్థులు ఎలా పాస్ కావాలని భయ బ్రాంతులకు గురవుతున్న విద్యార్థులను పటిచుకునే వారు లేరని ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు మేల్కొని 2,3 రోజులలో డీప్యూటేషన్ లను రద్దు చేసి విద్యార్థులకు న్యాయం జరిగేలా చూడాలని లేని యెడల భారతీయ జనతా పార్టీ ఆద్వర్యంలో పెద్ద ఎత్తున్న దేవరకొండ మండల ఆఫీసు , నల్గొండ జిల్లా విద్యాశాఖ ఆఫీసు వద్ద ధర్నా చేస్తామని హెచ్చరించారు.. ఈ సందర్భంగా వారితో గ్రామ నాయకులు జూలూరు బాలనారి, సాదు రామకృష్ణ జూలూరు ధనరాజు మండల నాయకుడు నేనావత్ రాము తదితరులు పాల్గొన్నారు.

# దళిత బంధు దేశానికి ఆదర్శం

### మాజీ ఎమ్మెల్యే.. జైపాల్ యాదవ్, మాజీ జడ్పిటిసి దశరథ్ నాయక్



కల్వకుర్తి.కడ్తాల్ డిసెంబర్ 2 వార్త మిర్రర్ ప్రతినిధి:-తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన దళిత బంధు పథకం దేశానికి ఆదర్శమని కల్వకుర్తి మాజీ శాసనసభ్యులు జైపాల్ యాదవ్,కడ్తాల్ మాజీ జెడ్పిటిసి జర్పుల దశరథ్ నాయక్ అన్నారు. కడ్తాల్ మండలంలోని మక్తమాదారం గ్రామానికి చెందిన ఎక్వేరి శివ దళిత బంధు ద్వారా వచ్చిన 10 లక్షల ఆర్థిక సహాయంతో సిరి టెంట్ హౌస్,సిరి చికెన్ సెంటర్ పేరిట వ్యాపారం ప్రారంభించడం జరిగింది. ఈ వ్యాపారాన్ని సోమవారం మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్,మాజీ జెడ్పిటిసి జర్పుల దశరథ్ నాయక్, పిఏసిఎస్ చైర్మన్ వెంకటేష్ చేతుల మీదుగా ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేసీఆర్ ప్రవేశపెట్టిన దళిత బంధు పథకం దేశానికి ఆదర్శంగా నిలబడిందని,కాంగ్రెస్ ఆరు గ్యారెంటీ పేరుతో అడ్డదారులో అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేస్తుందని అన్నారు. ఆరు గ్యారెంటీల్లో ఒక్క గ్యారెంటీ కూడా అమలు చేయలేని రేవంత్ సర్కార్ అబద్దాలతో పూట గడిపేస్తుందని తెలిపారు. పాలన చేతకాని రేవంత్ రెడ్డి నోరు విప్పితే కేసీఆర్ జపం చేస్తున్నాడని మండిపడ్డారు. ఇప్పటికైనా కేసీఆర్ జపం మానుకొని పాలనపై దృష్టి పెట్టాలని సూచించారు. కెసిఆర్ పాలనలో అన్ని వర్గాలకు న్యాయం జరిగిందని రేవంత్ సర్కార్ ఏ ఒక్క వర్గాన్ని కూడా న్యాయం చేసేలా కనపడతలేదని మండిపడ్డారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి మంజుల చంద్రమౌళి మాజీ సర్పంచ్ సులోచన సాయిలు హరిచంద్ నాయక్ శంకర్ నాయక్ మాజీ ఉపసర్పంచ్ గణేష్ శ్రీనివాస్ గౌడ్ సత్యనారాయణ మహేందర్ గౌడ్ చందు చెన్నయ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు



## ఎల్లాల శ్రీనన్న సేవా సమితి ఆధ్వర్యంలో దుబాయ్ లో వనభోజనాలు

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి డిసెంబర్ 2 : ఎక్కడో పుట్టి ఎక్కడో పెరిగి పరాయి దేశం లో దుబాయ్ ఎల్లాల శ్రీనన్న సేవా సమితి ద్వారా కలుసుకోని ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం ఎల్లాల శీనన్న సేవా సమితి వార్షికోత్సవం సందర్భంగా కుటుంబ సభ్యుల లాగా అందరూ కలిసి దుబాయ్ లో ని ఆల్ కుద్ర ప్రాంతంలో ని లవ్ లీకు పార్కు లో వన భోజనాల కార్యక్రమం అదివారం రోజున ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 750మందికి పైగా సభ్యులు పాల్గొన్నారు. ఆసక్తికరమైన ఆట పాటలతో, సాయంత్రం వరకు సరదాగా సంతోషంగా రోజు మొత్తం గడిపారు. నోరూరించే తెలుగు వంటకాలతో విందు భోజనాలు, ప్రత్యేక వంటకాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వీడియో కాల్ ద్వారా డాక్టర్ ఎల్లాల శ్రీనివాస్ రెడ్డి (అరుణ హాస్పిటల్ జగిత్యాల)కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమం లో దుబాయ్ ఎల్లాల శ్రీనన్న సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.



## బెంగాల్ లోని ప్రసిద్ధ కాళీ ఆలయాన్ని ప్రతి ఒక్కరూ దర్శించుకోవాలి: బండారు సుధాకర్ రెడ్డి

హయత్ నగర్ వార్త మిర్రర్ ప్రతినిధి (గణేష్ సాగర్) హయత్ నగర్ శ్రీ వెంకటేశ్వర రియల్ ఎస్టేట్ అధినేత బండారు సుధాకర్ రెడ్డి బందు మిత్రుల బృందం, పశ్చిమ బెంగాల్లోని కాళీ దేవతను దర్శించుకున్నారు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో సంకిపల్లి నరసింహారెడ్డి (ఎస్ ఎన్ ఆర్) బొప్పిడి అరుణాకర్ రెడ్డి, మునగాల శేఖర్ రెడ్డి, బసిరెడ్డి మల్లారెడ్డి, పన్నల రాజు రెడ్డి, పిసాటి వెంకట్ రెడ్డి, అమ్మి రెడ్డి భూపాల్ రెడ్డి, నల్లనికి కిరణ్, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతీయ రాష్ట్రాల్లో ఎక్కువగా ఆరాధించబడే దేవుళ్ళలో కాళీ మాత ఆలయం ఒకటి అందుకే ఆమెకు అంకితం చేయబడిన అనేక దేవాలయాలు ఉన్నాయి. కాశీ దేవి దుష్టశక్తులను నాశనం చేసేదిగా ప్రసిద్ధి చెందింది అన్నారు అన్నార. తాంత్రికలచే ఆదిశక్తిగా కూడా పూజించబడుతుంది కాళీ మాత, ఖాళీ దేవతకి మహంకాళి, భవతారిని, శంషాన్ కాళీ ,దక్షిణ కాళీ, సిద్దేశ్వరి కాళీ, భద్రకాళి వంటి వివిధ పేర్లతో ఉన్నాయి తెలిపారు. 501 శక్తి పీఠాల్లో ఒకటి పశ్చిమబెంగాల్లోని కాళీ ఆలయం ప్రస్తుతం హుంగ్లీ కి కలిపి ఆదిగంగ అనే చిన్న కాలువ ఒడ్డున ఉంది ఖాళీ ద్రాక్షాయని లేదా సరస్వతి దేవి కుడి పాదం యొక్క వేళ్ళు పడిపోయిన ప్రదేశాన్ని సూచిస్తుంది పశ్చిమ బెంగాల్ లోని ఈ ఆలయం ప్రస్తుతం రూపంలో సుమారు 200 సంవత్సరాల పురాణతమైనదని తెలిపారు



## దళిత బంధు దేశానికి ఆదర్శం

### మాజీ ఎమ్మెల్యే.. జైపాల్ యాదవ్, మాజీ జడ్పిటిసి దశరథ్ నాయక్

కల్వకుర్తి.కడ్తాల్ డిసెంబర్ 2 వార్త మిర్రర్ ప్రతినిధి:-తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన దళిత బంధు పథకం దేశానికి ఆదర్శమని కల్వకుర్తి మాజీ శాసనసభ్యులు జైపాల్ యాదవ్,కడ్తాల్ మాజీ జెడ్పిటిసి జర్పుల దశరథ్ నాయక్ అన్నారు. కడ్తాల్ మండలంలోని మక్తమాదారం గ్రామానికి చెందిన ఎక్వేరి శివ దళిత బంధు ద్వారా వచ్చిన 10 లక్షల ఆర్థిక సహాయంతో సిరి టెంట్ హౌస్,సిరి చికెన్ సెంటర్ పేరిట వ్యాపారం ప్రారంభించడం జరిగింది. ఈ వ్యాపారాన్ని సోమవారం మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్,మాజీ జెడ్పిటిసి జర్పుల దశరథ్ నాయక్, పిఏసిఎస్ చైర్మన్ వెంకటేష్ చేతుల మీదుగా ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేసీఆర్ ప్రవేశపెట్టిన దళిత బంధు పథకం దేశానికి ఆదర్శంగా నిలబడిందని,కాంగ్రెస్ ఆరు గ్యారెంటీ పేరుతో అడ్డదారులో అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేస్తుందని అన్నారు. ఆరు గ్యారెంటీల్లో ఒక్క గ్యారెంటీ కూడా అమలు చేయలేని రేవంత్ సర్కార్ అబద్దాలతో పూట గడిపేస్తుందని తెలిపారు. పాలన చేతకాని రేవంత్ రెడ్డి నోరు విప్పితే కేసీఆర్ జపం చేస్తున్నాడని మండిపడ్డారు. ఇప్పటికైనా కేసీఆర్ జపం మానుకొని పాలనపై దృష్టి పెట్టాలని సూచించారు. కెసిఆర్ పాలనలో అన్ని వర్గాలకు న్యాయం జరిగిందని రేవంత్ సర్కార్ ఏ ఒక్క వర్గాన్ని కూడా న్యాయం చేసేలా కనపడతలేదని మండిపడ్డారు. మాజీ ఎంపిటిసి మంజుల చంద్రమౌళి మాజీ సర్పంచ్ సులోచన సాయిలు హరిచంద్ నాయక్ శంకర్ నాయక్ మాజీ ఉపసర్పంచ్ గణేష్ శ్రీనివాస్ గౌడ్ సత్యనారాయణ మహేందర్ గౌడ్ చందు చెన్నయ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు



## శ్రీ కంఠమహేశ్వర స్వామి ఒడిబియ్యాల అన్న ప్రసాదం వితరణ

సంస్థాన్ నారాయణపూర్ డిసెంబర్ 2:( వార్త మిర్రర్) : నారాయణపురం మండల కేంద్రంలో శ్రీశ్రీశ్రీ సురమాంబదేవి- కంట మహేశ్వర స్వామి దేవాలయం గత కొద్ది రోజుల క్రితం నిర్వహించినటువంటి కళ్యాణ మహోత్సవం మరియు బోనాల పండగ విజయవంతం కావడంతో ఈరోజు పదహారు పండగ అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు ఈ యొక్క కార్యక్రమంలో పాల్గొని ఈ యొక్క కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినందుకు దేవాలయ కమిటీ చైర్మన్ రాపర్తి కర్నాకర్ గౌడ్ మరియు దేవాలయ కమిటీ సభ్యులను శాలువాతో సన్మానించిన నారాయణపురం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉప్పల లింగస్వామిఈ యొక్క కార్యక్రమంలో వివిధ కమిటీల గౌడ సంఘం సభ్యులు భక్తులు తదితరులు పాల్గొన్నారు

# రాహుల్‌గాంధీ జోఢోయాత్రలో ఇచ్చిన వాగ్దానాన్ని నెరవేర్చాలి

## చేనేత వస్త్రాలపై జిఎస్టి పన్ను ఎత్తివేయాలి... పద్మశాలీలకు రావలసిన రిజర్వేషన్లు వచ్చేవరకు ఉద్యమిస్తాను శాసనమండలిలో బీసీల తరపున నా గళం విప్పుతాను.... ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

హైదరాబాద్ వార్తా మిర్రర్ ప్రతినిధి (ఏలే భాస్కర్): తెలంగాణ శాసనమండలిలో, శాసనసభలో చేనేత కార్మిక సమస్యలు పరిష్కరించాలి అని శాసనమండలి సభ్యురాలు, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ను అఖిలభారత పద్మశాలి సంఘం, రాజకీయ విభాగం, తెలంగాణ పద్మశాళి సంఘం ప్రతినిధులు, ముఖ్య నాయకులందరూ మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రాన్ని అందజేశారు.



**చేనేత సమస్యలు :-**

1) గత ప్రభుత్వం అమలు చేసిన చేనేత మిత్ర నూలు సబ్సిడీ లో భాగంగా మగ్గం నేసే వారికి 2వేలు, అనుబంధ పని వారికి 1 వేయి ఇచ్చే పథకాన్ని తిరిగి ప్రారంభించాలి. ఈ పథకం 2023 నవంబర్ నుండి ఆగిపోయింది.
2) రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన చేనేత కార్మికుల వ్యక్తిగత రుణమాఫీని, చేనేత సహకార సంఘాల క్యాష్ క్రెడిట్ వెంటనే మాఫీ చేయాలి.
2) కెసిఆర్ ప్రభుత్వం, చేనేత కార్మికులకు అందించిన నేతన్న కు చేయూత త్రిఫ్ట్ పథకం పునరుద్ధరించి, కొత్త వారికి అవకాశం కల్పించాలి.
3) చేనేత, మరనేత కార్మిక కుటుంబాలకు ప్రత్యేకంగా కాలనీలు ఏర్పాటు చేయాలి, ఎందుకనగా ఇరుగు పొరుగు వారికి మగ్గాల శబ్దం తో ఇబ్బంది లేకుండా ఉంటుంది.
4) పెట్టుబడి సహాయం కింద 1 లక్ష ఆర్థిక సహాయం ఇవ్వాలి.
5) సహకార సంఘాలు కొత్తగా ఏర్పాటు చేస్తూ, బడ్జెట్ లో 1000 కోట్లు కేటాయించి ఉత్పత్తి పెంచి ప్రభుత్వం కొనుగోలు చేయాలి.
6) ప్రభుత్వం ప్రకటించిన పద్మశాలి కార్పొరేషన్ కు నిధులు మరియు పాలకవర్గాన్ని వెంటనే ఏర్పాటు చేయాలి.
7) చేనేత సహకార సంఘాలకు ప్రభుత్వం వెంటనే ఎలక్షన్స్ నిర్వహించాలి.
8) భారత్ జోడో యాత్రలో భాగంగా తెలంగాణలో రాహుల్ గాంధీని కలిసిన తెలంగాణ మరియు అఖిలభారత పద్మశాలి సంఘం నాయకులకు ఇచ్చిన మాట ప్రకారం చేనేత పై ఉన్న జిఎస్టిని రాష్ట్రంలో అధికారంలోకి వస్తే రాష్ట్ర ప్రభుత్వ వాటాను రాష్ట్రమే భరిస్తుందని, కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కేంద్ర ప్రభుత్వం భరిస్తుందని హామీ ఇచ్చారు, అట్టి హామీని అమలు చేయాలి.
9) నేత కార్మికులకు ప్రత్యేకంగా గుర్తింపు కార్డులు జారీ చేసి, 45 సంవత్సరాలకె పెన్షన్ పొందే విధంగా చేయాలి.
10) రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న చేనేత మరియు మర నేత కార్మికులకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు అందించాలి.
11)తెలంగాణ ప్రభుత్వం కొండా లక్ష్మణ్ బాపూజీ పేరిట అవార్డు ల కింద 1 లక్ష రూపాయలు, మెమెంటో ఇవ్వాలి.

తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు చట్టసభలో రిజర్వేషన్లు వచ్చేవరకు కృషి చేస్తే, మేము మీతో కలిసి పని చేస్తాం పద్మశాలి కి రావాల్సిన వాటా ఇవ్వాల్సిందే.

ఈ కార్యక్రమంలో అఖిల భారత పద్మశాలి సంఘ జాతీయ అధ్యక్షులు కందగట్ల స్వామి, అఖిలభారత పద్మశాలి సంఘం రాజకీయ విభాగం జాతీయ అధ్యక్షుడు బొల్లా శివశంకర్,తెలంగాణ పద్మశాలి సంఘ మహిళా అధ్యక్షురాలు గుంటక రూపక, తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం ఉపాధ్యక్షుడు గుర్రం శ్రవణ్, తెలంగాణ పద్మశాళి సంఘ రాజకీయ విబాగా ప్రధాన కార్యదర్శి బొమ్మ ప్రవళిక, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జిల్ల నరేందర్, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు చిట్టిమల్ల గణేష్, అంబటి శ్రీనివాస్, బొమ్మ అమరేందర్, నోముల రేఖ, చితక్కోళ్ల స్వప్న, రమాదేవి, విజయలక్ష్మి, జూలూరి ఆంజనేయులు, విడం సంతోష, చిన్ని రాకేష్, చింతకింది కిరణ్, బొట్ల పరమేశ, దోర్నాల గజేందర్, విజయ్, శ్రీకాంత్, కల్పన, సంఘశెట్టి నరేందర్, తారాసోర్ విశాల్, అంకం భరత్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు దుర్వ్యసనాలకు దూరంగా ఉండాలి

## రాయికల్ సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ శ్రీ సుధీర్ రావు

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి డిసెంబర్ 2 స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల రాయికల్ లో జగిత్యాల జిల్లా సైబర్ నేరాల నియంత్రణ కోఆర్డినేషన్ సెల్ పోలీసు శాఖ ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థిని విద్యార్థులకు రాయికల్ పట్టణ సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ శ్రీ సుధీర్ రావు పోలీసు శాఖ అనుబంధ కళాబృందం చే ఒక అవగాహన సమావేశాన్ని కళాశాల ప్రాంగణంలో నిర్వహించి సైబర్ నేరాలను నియంత్రించడానికి తగు అవగాహన కల్పించారు.. ఈ సందర్భంగా ఎస్సై సుధీర్ రావు మాట్లాడుతూ ట్రాఫిక్ పైన అవగాహన కల్పించారు. లైసెన్స్ లేని వారు వాహనాలు నడపకూడదని .. హెల్మెట్ లేకుండా వాహనం నడపడం ప్రమాదకరమని మరియు ఎట్టి దుర్వ్యసనాలకు అలవడకుండా చక్కగా విద్యాభ్యాసం చేసి విద్యార్థులు తమ జీవితాలను సార్థకం చేసుకోవాలని సందేశించారు. అనంతరం కళాబృంద గాయకులు పిల్లల్లో నైతిక సామాజిక విలువలు సూచించే పలు పాటలు పాడి విద్యార్థినీ విద్యార్థులను అలరించారు. సమావేశాన్ని ఉద్దేశించి కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ శ్రీ పుప్పాల దేవేందర్, చరిత్రోపన్యాసకులు, ప్రోగ్రాం కన్వీనర్ ఎస్. రాజేంద్రప్రసాద్ జె .ఎల్ ఇంగ్లీష్, పి మనోహర్




రెడ్డి ఫిషరీస్ లెక్చరర్ లు ఈ నేపథ్యంగా పలు సూచనలు ఇచ్చారు. ఇట్టి కార్యక్రమంలో ఏఎస్ఐ దేవేందర్, ఉపన్యాసకుల బృందం మరియు బోధ నేతర సిబ్బంది పాల్గొన్నారు..

# గత ప్రభుత్వంలో ఉన్నటువంటి చేనేత పథకాలను యధావిధిగా అమలు చేయాలి

## పద్మశాలి యువజన నాయకులు సింగం కృష్ణ

సంస్థాన్ నారాయణపురం,డిసెంబర్2:, ( వార్త మిర్రర్)గత ప్రభుత్వం అమలు చేసిన దారం సబ్సిడీ,త్రిపుడు ఫండ్,పథకాలు అమలు చేశాయి.గత ప్రభుత్వం చేసిన విధంగా కాకుండా నేరుగా జియో టాక్ ఉన్న ప్రతి చేనేత కార్మికుడు ఖాతాలో,దారం సబ్సిడీ, పడేవిధంగా అమలు చేయాలి.మధ్య దళారీలు లేకుండా దారం సబ్సిడీని జిఓ టాక్ ఉన్న ప్రతి చేనేత కార్మికుడి ఖాతాలో వేయాలి.అదేవిధంగా గత ప్రభుత్వ అమలు చేసిన త్రిపుడు ఫండ్,పథకం ప్రతి చేనేత కార్మికుడు నెలనెలా తన సంపాదనలో 8,ఎనిమిది శాతం,తమ ఖాతాలో జమ చేస్తే గవర్నమెంట్ నుంచి16 పదహారు శాతం ఇచ్చేవారు.అలా కాకుండా చేనేత కార్మికుడు కట్టకుండానే గవర్నమెంట్ తమ ఖాతాలో 16పదహారు శాతం జమ చేయాలి. ఎందుకంటే ప్రతి నెల చేనేత కార్మికుడు జమ చేయలేక పోతున్నాడు.కావున ప్రస్తుతం ఉన్న ప్రభుత్వం ఏ స్కీము అయినా చేనేత కార్మికునికి నేరుగా చేనేత కార్మికుని ఖాతాలో వేయాలి.దీనికి మధ్యలో ఏ దళారీ లేకుండా చూడాలి.ఎందుకంటే దళారీల వల్ల చేనేత కార్మికునికి ప్రభుత్వం ఇచ్చే పథకం పూర్తిగా అందడం లేదు.కావున దయచేసి ప్రస్తుతం ఉన్న ప్రభుత్వం ఏ స్కీమ్ అమలు చేసిన జీఓ టాకు ఉన్న ప్రతి చేనేత కార్మికుడి ఖాతాలో జమ చేయవలసిందిగా విన్నపం.అదే విధంగా ప్రభుత్వం ప్రకటించిన విధంగా చేనేత కార్మికుల రుణాలను త్వరగా మాఫీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.



## భావితరాలకు సురక్షితమైన పర్యావరణాన్ని అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత

### స్ఫూర్తి ఫౌండేషన్ చైర్మన్ రాపర్తి సురేష్ గౌడ్



యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి (గణేష్ సాగర్) డిసెంబర్ 2 తేదీ జాతీయ కాలుష్య నివారణ దినోత్సవం సందర్భంగా స్ఫూర్తి ఫౌండేషన్ చైర్మన్ రాపర్తి సురేష్ గౌడ్ మాట్లాడుతూ కాలుష్యం అనేది గాలి, నీరు, నేల మరియు జీవులను ప్రతికూలంగా ప్రభావితం చేసే హానికరమైన పర్యావరణ పదార్థాల ఉనికి కాలుష్య కారకాలు ఫ్యాక్టరీలు, వాహనాల చేత మరియు రసాయనాల వంటి వివిధ వనరుల నుండి వస్తాయని అన్నారు. కాలుష్యం పర్యావరణ వ్యవస్థల సహజ సమతుల్యతను దెబ్బతిస్తాయని మానవులలో ఆరోగ్య సమస్యలు వస్తాయని తెలిపారు. మనం తీసుకునే ప్రతి శ్వాస మన పర్యావరణ యొక్క ఆరోగ్యం పై ఆధారపడి ఉంటుంది. కానీ కాలుష్యం మన గ్రహం వృద్ధి చెందడం కష్టతరం చేస్తుంది అన్నారు జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవం కాలుష్యానికి వ్యతిరేకంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు రాపర్తి సురేష్ గౌడ్

## చల్లా లింగారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను

# సందర్శించిన బిఆర్ఎస్ శ్రేణులు

వార్త మిర్రర్ ( రంగారెడ్డి జిల్లా ప్రతినిధి.. ధనుం జయ్ నేత ).. డిసెంబర్ 2 : మహేశ్వరం నియోజకవర్గం మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ జిల్లెల గూడలో సోమవారం బి.ఆర్.యస్ పార్టీ అధిష్టానం మరియు మాజీమంత్రి మహేశ్వరం నియోజకవర్గం శాసనసభ్యురాలు పట్లోల సబితా ఇంద్రారెడ్డి ఆదేశానుసారం రంగారెడ్డి జిల్లా బి.ఆర్.యస్.వి పార్టీ ఆధ్వర్యంలో మీర్ పేట్ మునిసిపల్ కార్పోరేషన్ బి.ఆర్.యస్ పార్టీ అధ్యక్షుడు అర్కల కామేష్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లెలగూడలో ఉన్న చల్లా లింగారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి అక్కడ విద్యార్థులకు పైలట్ ప్రాజెక్ట్ కింద చేసిన అభివృద్ధి పనులలో భాగంగా ఏర్పాటుచేసిన డిజిటల్ క్లాస్ రూమ్స్ ను సందర్శించడం జరిగింది అలాగే అక్కడ ఏర్పాటుచేసిన మధ్యాహ్న భోజన ఏర్పాట్లను పరిశీలించి నాణ్యతను తనికీ చేయడం జరిగింది విద్యార్థులతో మాట్లాడి ఏమైనా అసౌక ర్యాలు ఉన్నాయా అని అడిగి తెలుసుకోవడం జరిగింది దానికి బదులుగా విద్యార్థులు ఇక్కడ అన్ని వసతులు చాల బాగు న్నాయి అని ఉపాధ్యాయులు డిజిటల్ పాఠాలు బోధిస్తున్నారు అని ,అధునాతన బెంచీలు కూడా కూర్చోవడానికి సౌకర్యంగా ఉన్నాయి అని, భోజన ఏర్పాట్లు కూడా చాల మంచిగా రుచిగా చేస్తున్నారు అని తెలియజేయడం జరిగింది.ఇవే కాకుండా విద్యార్థులకు ఏమైనా అసౌకర్యాలు ఉన్నా లేదంటే ఇంకా



అదనపు సౌకర్యాలు కావసినచో నేరుగా వారికి స్థానిక శాసనసభ్యులు కి నేరుగా ఫోన్లో సంప్రదించగలరు అని వారికి వారి వ్యక్తిగత నెంబర్ ఇవ్వడం జరిగింది.ఈ సందర్శనలో పాల్గొన్న మీర్ పేట్ మునిసిపల్ కార్పోరేషన్ డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్ రెడ్డి,ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్ రెడ్డి,బి.ఆర్.యస్ పార్టీ కార్పొరేటర్లు సిద్ధాల లావణ్య బీరప్ప,బొక్క రాజేందర్ రెడ్డి,సిద్ధాల పద్మ అంజయ్య, ధనలక్ష్మి రాజ్ కుమార్,కో-ఆప్షన్ సభ్యులు యం.ఏ రజాక్, బి.ఆర్.యస్ పార్టీ నాయకులు వర్కింగ్ ప్రెసిడెంట్ దిండు భూపేష్ గౌడ్,పొరెడ్డి ప్రభాకర్ రెడ్డి,గోపి యాదవ్,బలరామ్, మీర్ పేట్ బి.ఆర్.యస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు జమాల్పూర్ సునీత బాలరాజ్,బి.ఆర్.యస్.వి జిల్లా నాయకులు షేర్ రమన్ తదితరులు పాల్గొన్నారు.



## లాలాగూడ ఇన్స్ పెక్టర్ రఘు బాబును సన్మానించిన విజయపురి కాలనీ యూత్ నాయకులు

సికింద్రాబాద్, వార్త మిర్రర్ డిసెంబర్ 2... ఇటీవల పదవి బాధ్యతలు స్వీకరించిన లాలాగూడ ఇన్స్ పెక్టర్ రఘుబాబును విజయపురి కాలనీ యూత్ అసోసియేషన్ నాయకులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విజయపురి కాలనీ యూత్ నాయకులు షారుఖ్, మనోజ్, శివ, తమిమ్, హైదర్, అనాస్ తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి దూరచూపుతో ప్రజా పాలన దిశగా ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకెళ్తుంది

### ::: కాంగ్రెస్ నాయకులు ఉప్పల లింగస్వామి



యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి (గణేష్ సాగర్) : తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలనలో ప్రభుత్వ పథకాలు, చేస్తున్న మంచి పనులకు గ్రామాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం పై పూర్తి విశ్వాసంతో ఉన్నారని తెలిపారు. అధికారంలోకి వచ్చిన పది నెలల్లోనే 21 వేల కోట్ల రుణమాఫీ ఘనత దేశంలోనే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిది అని ఉప్పల లింగస్వామి అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కేసీఆర్ ఉన్నప్పుడే క్షీణించింది అని అయినా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దూర చూపుతో ప్రజాపాలన దిశగా ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు వెళుతుందని అన్నారు

## బెంగాల్ చరిత్ర, సంస్కృతి, పర్యాటక ఆకర్షణలకు చిహ్నంగా నిలిచిన హౌరా బ్రిడ్జిని సందర్శించిన హయత్ నగర్ రియల్ ఎస్టేట్ బృందం



హయత్ నగర్ వార్త మిర్రర్ ప్రతినిధి (గణేష్ సాగర్) : హయత్ నగర్ ఎస్టేట్ మిత్ర బృందం, బెంగాల్ లోని పర్యాటక ఆకర్షణలకు చిహ్నంగా ప్రసిద్ధి చెందిన హౌరా వంతెనను సందర్శించిన, బండారు సుధాకర్ రెడ్డి మిత్ర బృందం సంకిపల్లి నరసింహారెడ్డి (ఎస్ ఎన్ ఆర్) బొప్పిడి అరుణాకర్ రెడ్డి, మునగాల శేఖర్ రెడ్డి, బసిరెడ్డి మల్లారెడ్డి, పన్నల రాజు రెడ్డి, పిసాటి వెంకట్ రెడ్డి, అమ్మి రెడ్డి భూపాల్ రెడ్డి, నల్లనికి కిరణ్, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కలకత్తా నుండి హౌరా ను కలిపి అందమైన రవీంద్ర సేతు నేడు బెంగాల్ చరిత్ర సంస్కృతి మరియు పర్యాటక ఆకర్షణలకు చిహ్నంగా మారింది అన్నారు. హౌరా వంతెనగ ప్రసిద్ధిచెందింది. ఇది 1946లో నిర్మించబడింది ఇప్పటివరకు రోజు భారీ సంఖ్యలో ట్రాఫిక్ ను చూస్తుంది. మేము పరిశీలన కోసం హౌరా వంతెన దాన్ని చరిత్ర గురించి మొత్తం సమాచారాన్ని సేకరించామని అన్నారు.



## భగత్ సింగ్ నాయి బ్రాహ్మణ సేవా సంఘానికి రాధాకృష్ణ ట్రస్ట్ ఆర్థికసాయం

కల్వకుర్తి కడ్తాల్ డిసెంబర్ 2 వార్త మిర్రర్ ప్రతినిధి:-కడ్తాల్ మండల కేంద్రంలో భగత్ సింగ్ నాయి బ్రాహ్మణ సేవా సంఘానికి జర్పుల రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ రూ"51,000 వేల రూపాయల ఆర్థిక సాయం అందించింది. సంఘం ఆధ్వర్యంలో త్వరలో నిర్మాణం కాబోతున్న భవనము మరియు భవన ఆవరణలో భగత్ సింగ్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని గాను 51000 రూపాయలను మాజీ ఎమ్మెల్యే జయపాల్ యాదవ్, ట్రస్ట్ చైర్మెన్ జర్పుల దశరథ్ నాయక్ చేతుల మీదుగా కమిటీ సభ్యులకు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ వెంకటేష్ ఐక్యవేదిక అధ్య క్షులు ఎర్రోళ్ళ రాఘవేందర్ కానుగుల లక్ష్మయ్య సత్యం శివ మహేందర్ జంగయ్య వెంక టేష్ శ్రీను మురళి శంకరయ్య మహేష్ నరసింహ మహేష్ నాయకులు డైరెక్టర్ లాయక్ ఆలీ మంగళపల్లి నరసింహ మధు జంగయ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే కసిరెడ్డి

కల్వకుర్తి డిసెంబర్ 2 వార్త మిర్రర్ ప్రతినిధి:- ప్రభుత్వ మంజూరు చేసిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి వివిధ మండలాలకు చెందిన లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి చికిత్స కోసం ఆస్పత్రులకు డబ్బు ఖర్చు చేసిన వారికి సిఎంఆర్ఎఫ్ ద్వారా చేయూత నివ్వడం హర్షించదగిన విషయమన్నారు. అధికారంలోకి వచ్చి సంవత్సరలో పే అనేక సంక్షేమ పథకాలను తీసుకరావడం రేవంత్ రెడ్డి కే సాధ్యమైనది అన్ని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, చెక్కు లబ్ధిదారులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు